# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 37 సంచిక 7
పేజీలు 44
మార్చి 2018

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ........................................4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 6
అమ్మమాట........................................ 10
జీవన్ముక్తి ........................................12
నీ జీవిత నిర్మాతవు నీవే ........................................ 14
త్రిపురా రహస్యం ........................................ 16
ఉద్ధాలక అరణి - శ్వేతకేతు .................. ....17
అడియేన్ - దాసోహమ్ ........................................19
త్యాగ మహిమ ...................................... ...............21
శివుని కథలు ........................................ ..23
మల త్రయం ........................................26
యోగవాశిష్ఠము ........................................ 28
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........................................30
పరిప్రశ్న ........................................31
శ్రీకృష్ణకర్ణామృతము........................................34
త్రిగుణాలు ........................................36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ..............................41
యాజమాన్యం వివరాలు ........................................42

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।
మయి సర్వం లయం యాతి తద్ బ్రహ్మాద్వయమస్మ్యహం ॥
(కైవల్యోపనిషత్ 19వ శ్లో॥)

నేను అద్వయమైన బ్రహ్మను. నా యందే సర్వమూ జనించి, నాయందే సర్వమూ ప్రతిష్ఠమై, నా యందే సర్వమూ లయమౌతోంది అనేది సర్వ సృష్టికి ఆధారమైన ఆ బ్రహ్మను నేనే అనే ఆత్మజ్ఞానాన్ని సాధకుడు సద్గురుమూర్తి సారథ్యంలో తెలుసుకోగలుగుతాడు.

కారణము లేకుండా కార్యం వుండదు కదా! కార్యములన్నీ కారణము నుండే ఉద్భవించి కారణముతోనే ఉంటూ దాని యందే లయమౌతున్నాయి. ఆ విషయము లోకవిదితమైనదే కదా! తరంగాలు సముద్రములోనే పుట్టి సముద్రములోనే వుండి దానియందే లయం చెందుతున్నాయి. ఆభరణాలన్నీ బంగారము నుండే పుట్టి దానియందే వుంటున్నాయి.

అలాగే సుఖదుఃఖాది ద్వంద్వములతో కూడిన దృశ్య ప్రపంచం బ్రహ్మ నుండి పుట్టి తత్త్వానుభూతి కలగగానే బ్రహ్మముతోనే కూడి వున్నవన్నీ బ్రహ్మమునందే లీనమై పోతున్నాయి. సాధకుడు ఒక అవస్థ నుండి వేరొక అవస్థకు చేరుకున్నప్పుడు ఆ సాధకుడు ఏ ఒక్క వస్తువును తన వెంట తీసుకుని వెళ్ళటం లేదు. ఉదాహరణకు జాగ్రదావస్థ నుండి స్వప్నావస్థకు చేరుకున్నప్పుడు తన వెంట ఏ వస్తువును తీసుకువెళ్ళటం లేదు. జాగ్రదావస్థలోని సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, జయాపజయాలు స్వప్నంలోనికి ప్రవేశించలేవు. మేల్కొన్నవాడే జాగ్రదావస్థననుభవిస్తున్నాడు. స్వప్నాన్ని చూచేవాడు వేరు. మేల్కొన్నవాడు తాను స్వప్నంలో అనుభవించినది అంతా తన మనస్సులో లీనమైనదని తెలుసుకుంటాడు. స్వప్న ప్రపంచమంతా తన మనస్సునుండే ఉద్భవించినదని గ్రహించ గలుగుతాడు.

అలాగే సాధకుడు ధ్యానంలో దేహమనోబుద్ధులను దాటి ఆత్మానుభూతిలో స్థిరపడగానే ఈ దృశ్య ప్రపంచం తనలోనే లీనమైనదని

తెలుసుకోగలుగుతాడు. సద్గురు ఉపదేశించిన 'తత్త్వమసి' మహా వాక్యాన్ని మననము, విచారణ ద్వారా మూడు అవస్థలలోను వుండేది వాటికి ఆధారమైనది ఆత్మ ఒక్కటే అన్న విషయాన్ని సాధకుడు గ్రహించ గలుగుతాడు.

అయితే ధ్యానంలో సాధకుడు మనోవృత్తులు పరాధీనమై విషయ ప్రపంచం తనలో ప్రవేశించకుండా తాను జాగరూకత వహించాలి. అప్పుడే సత్యతత్త్వము ప్రకాశిస్తుంది. అది నిరంతర సాధన ద్వారా సాధ్యపడుతుంది.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

మార్చి 2018

02 శుక్రవారం -పూర్ణిమ (హోలీ),రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

11 ఆదివారం - శ్రీగురుదశమి; రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ.

18 ఆదివారం - శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది, ఉదయం 11 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

25 ఆదివారం - శ్రీరామనవమి. ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

31 శనివారం - పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

ఏప్రియల్ 2018

10 మంగళ - శ్రీగురుదశమి. రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాద పూజ.

20 శుక్ర - శ్రీ శంకరజయంతి

29 ఆది - వైశాఖపూర్ణిమ. శ్రీసద్గురుపాదపూజ.



పాఠకులకు ఉగాది,
శ్రీరామనవమి
శుభాకాంక్షలు



# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

25 -12- 1979

శ్రీబాబూజీ ఉదయం వాకింగ్‌కి వచ్చారు. భక్తుల చరిత్రలు చదివిన తర్వాత "మహాత్ములు అద్భుతాలు చేయటం భక్తులకు విశ్వాసాన్ని కల్గించటానికి మాత్రమేగాని వారికి వ్యామోహం ఉండదు. అయితే చేతిలో రూపాయి చెవిలో మంత్రం కోవకి చెందిన గురువులు కొంతమంది వ్యాయామ ప్రదర్శనలు, గారడీవిద్యలు ప్రదర్శిస్తారు దానివలన ప్రయోజనం? అది తరించటానికి వుపయోగ పడుతుందా? ఒక గుడ్డివాడు ఇంకొక గుడ్డివాడి చెయ్యి పట్టుకుంటే ఏమవుతుంది? గుడ్డివాడు గోతిలో పడగానే వాడి చెయ్యి పట్టుకొన్న వాడు అదే గోతిలో పడతాడు" అన్నారు శ్రీ బాబు.



శ్రీ బాబూజీకి మహత్తులు ప్రదర్శించటం అన్నా లేదా వాటిని గురించి ప్రచారం చేయటం అన్నా ఇష్టం ఉండేది కాదు. అందువలననే శ్రీ బాబూజీ శిష్యకోటి అంతా ఆయనను గురించి చెప్పటానికి భయపడేవారు.

శ్రీబాబూజీ ఆ విషయాన్ని చెపుతూ "వీడు కూడా ఏవో మహత్తులు ప్రదర్శించాడేమో!" అన్నారు.

అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ముందుగా టిక్కెట్టు కొనటం జరగలేదు. దేవీ నవరాత్రి మహోత్సవాలు వచ్చేశాయి. శ్రీ బాబూజీ తప్పనిసరిగా స్వదేశానికి వెళ్ళిపోవాలి అన్నారు. కాని టిక్కెట్లు లభించలేదు. ఆయన శిష్యులంతా చాలా ప్రయత్నం చేశారు. స్వదేశానికి తిరుగు ప్రయాణం చేయవలసిన రోజు రానే వచ్చింది. శ్రీ బాబూజీ ఒక శిష్యుని పిలిచి విమానాశ్రయానికి ప్రయాణానికి ఏర్పాటు చేయమన్నారు. టిక్కెట్లు దొరకని కారణంగా శిష్యులంతా ప్రయాణం

ఎలా జరుగుతుందా అని సందేహించారు. అయినా శ్రీ బాబూజీ ఆజ్ఞ మేరకు లగేజి అంతా సర్దుకొని విమానాశ్రయానికి శ్రీ బాబూజీతో వారంతా వెళ్ళారు. వారంతా విమానాశ్రయం చేరేసరికి, భారతదేశానికి లండన్ మీదుగాపోయే విమానం బయలుదేరటానికి సిద్ధంగా వుంది. విమానాశ్రయం వారు అప్పుడే శ్రీ బాబూజీని నారాయణగార్లను వెంటనే చెకింగ్ కౌంటర్ దగ్గర రిపోర్టు చేయమని ప్రకటించారు.

శ్రీ బాబూజీకి, నారాయణగార్లకు ఇదివరలోనే రెండు టిక్కెట్లు రిజర్వు చేయబడిఉన్నాయి. అది ఎలా జరిగింది? ఎవరు చేశారు? అనే వివరాలు మాత్రం మీరే ఊహించండి. శ్రీ బాబూజీ మాట్లాడుతూ "ఎవరో మన శిష్యులు కొని ఉంటారేమో టిక్కెట్లు" అన్నారు. వెంకటరత్నంగారు "అబ్బే! మీకేమి తెలియదు పాపం" అన్నారు.

శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ డాక్టరు రాజుని "చెప్పవయ్యా వెంకట్రాజుగారి సంగతి" అన్నారు. డాక్టరు రాజు డాక్టరు వెంకట్రాజుగారి విషయం చెప్పటం ప్రారంభించేసరికి శ్రీ బాబు వెంకట్రాజుగారి గురించి చెప్తూ భక్తులు వారి వారి జన్మ సంస్కారాన్ని బట్టి చక్కని అనుభూతులు పొందుతారు. డాక్టరు వెంకట్రాజుగారు మంచి భక్తులు. ఆయన ఎప్పుడూ ఆధ్యాత్మిక చింతననే కోరేవారు అన్నారు.

డాక్టరు రాజు మాట్లాడుతూ వెంకట్రాజుగారు నిండ్రకొలనులో ఆయన మిత్రులకందరికి, 'శ్రీ బాబూజీ మహాపురుషులు, ఆయనని ఎట్టి పరిస్థితులలోనూ వదలకండి. మీరంతా ఈ తరంలో జన్మించటం చాల అదృష్టము. ప్రతి యుగానికి ఒక మహాపురుషుడు ఉద్భవిస్తాడు. ఆనాడు శ్రీరామచంద్రుని సేవించి తరించినవారి కథలు వింటే మనకు ఎంత అసూయగా ఉంటుంది. శ్రీరామచంద్రునివంటి యుగపురుషుడు మన బాబూజీ. ఆయనను సేవించండి. మననందరిని తరింపచేస్తారు' అని చెప్పేవారు.

డాక్టరు వెంకట్రాజుగారికి తీవ్ర సుస్తీ చేసింది. భీమవరం తీసుకువెళ్ళి తనకు వైద్యం చేయించవలసిందిగా బంధుమిత్రులను ఆయన కోరారు. భీమవరం వెళ్ళి ఒక సత్రంలో మకాం చేశారు. ఎంతమందో వైద్యులు కృషి చేశారు. కాని ఆయనకు ఉపశమనం లేదు. వైద్యులు పెదవి విరిచారు. భగవంతుడు మినహా ఎవరూ రక్షించలేరని

చెప్పారు. అట్టి సమయంలో వెంకట్రాజుగారు శ్రీ బాబూజీని దర్శించాలని కోరారు. ఆయన కదిలే స్థితిలో లేరు. అదే సమయంలో పరశు రామయ్యగారి అల్లుడు శ్రీ చల్లా కృష్ణమూర్తిగారు, శ్రీ బాబూజీతో మహాత్ములు మహత్తులు ప్రదర్శించటం గురించి చర్చవచ్చి, చనిపోయిన వారిని బ్రతికించటం అసాధ్యము అని శ్రీ బాబూజీతో వాదిస్తున్నారట.

దీనిని నిరూపించటానికేనేమో అన్నట్లుగా ఈ ఉదంతం జరిగింది. వెంకట్రాజుగారు ప్రాణం విడిచారు. ఆయన శరీరానికి చీమలు కూడా పట్టాయి. డాక్టర్లు అంతా ఆయన మరణించినట్లుగా నిర్ధారణ చేశారు. ఆయన అంతిమ యాత్రకు అంతా ఏర్పాటు చేయబడింది. అయితే వెంకట్రాజుగారి మరణవార్తను శ్రీ బాబూజీకి తెలియజేయటానికి వెళ్ళిన వార్తాహరుడు కాలానికి మించి సైకిలుమీద ప్రయాణం చేశాడు. ఆ ప్రయాణం ఎలా చేశాడో ఆ పరమాత్ముడికే తెలియాలి. శ్రీ బాబూజీ ఆ వార్తాహరునికి మాత్రం "నేను ఇప్పుడే వస్తున్నాను, డాక్టరు గారిని నేను వచ్చేవరకు మాత్రం ఉంచమనండి" అని చెప్పారు.

శ్రీ బాబూజీ వచ్చేవరకూ డాక్టరుగార్ని అలానే ఉంచారు. వెంకట్రాజుగారి భార్య తనకు పతిభిక్ష పెట్టమని శ్రీ బాబూజీని కోరారు. శ్రీ బాబూజీ అప్పుడు జగన్మాతను ప్రార్థించి డాక్టర్లవైపు చూసి మృతిచెందిన వెంకట్రాజుగారికి ఇంజక్షన్ ఇవ్వమన్నారు. డాక్టర్లంతా అవహేళన చేశారు. అయినప్పటికి శ్రీ బాబూజీ ఆజ్ఞ మేరకు తుదకు ఇంజక్షన్ ఇచ్చారు. శ్రీ బాబూజీ వెంకట్రాజుగారి భార్యతో "అధైర్యపడకండి. మీ భర్త కోలుకుంటాడు. కొలదిసేపైన తర్వాత నీరు అడుగుతాడు. తప్పక ఇవ్వండి" అని చెప్పి, తాము ధ్యానములో నిమగ్నమైనారు. శ్రీ బాబూజీ చెప్పినట్లుగానే సుమారు 12గం॥ల సమయంలో వెంకట్రాజుగారు కోలుకొని నీరు అడిగారట. దీనిని గమనించి డాక్టర్లంతా ఇది కలా? నిజమా? అని ప్రశ్నించుకొన్నారట.

శ్రీ బాబూజీ బాల్యంలో అనేక వ్యాయామ ప్రదర్శనలు చేసేవాడినని చెపుతూ "గారడీ విద్యల ప్రదర్శనల వ్యామోహంలో పడిన మానవుడు వాటి ఆకర్షణల నుంచి తప్పించుకొనలేక భ్రష్టుడౌతాడు. మనస్సుని దీనినుండి నిగ్రహించుకోవాలి. మనస్సు నిశ్చలత్వాన్ని పొందినపుడే ఆత్మదర్శనం అవుతుంది. పయనించే రైలుబండిలో ఒక

వ్యక్తి ఉన్నాడనుకోండి. ఆ వ్యక్తిని దర్శించాలంటే బండి ఆగినపుడు మాత్రమే సాధ్యపడుతుంది.

చీకటి గదిలో నడిచిన మానవుడు ఎలా ఎదురుదెబ్బలు తింటాడో అలాగే అజ్ఞానమనే చీకటి ఆవరించిన మానవుడి మనస్సు విషయవాసనలకు లోనై శాంతి ఉండదు. మహాత్ములు ఎల్లప్పుడూ ఆత్మదర్శనమనే జ్ఞాన తేజస్సును దర్శిస్తూ ఉంటారు. వారు కేవలం కారణజన్ములు. వారు నిర్వహించవలసిన కార్యక్రమాన్ని పూర్తిచేసిన పిమ్మట దేహపరిత్యాగము చేస్తారు. వారే సత్యగురువులు. వారి దివ్య చరణారవిందములందు మనస్సు నిలిపిన వారి జన్మ చరితార్థము. గురుదేవులు దైవస్వరూపులు. గురుదేవులను ఆరాధించినట్లయితే వేరే దైవాన్ని ఆరాధించనవసరంలేదు. త్రిగుణాత్మకమైన మనస్సు గాజుపట్టకమువలె సప్తవర్ణములను జయించి శుద్ధమైన వెలుగు అనబడే ఆత్మ తేజస్సును దర్శిస్తుంది. దీనినే నిర్వికల్ప సమాధి అంటారు. ఈ స్థితిలో త్రిగుణములు సత్యం, శివం, సుందరంగా మారుతాయి.

కాబట్టి మీరు సాధించవలసింది ఏది? తాత్కాలికమైన కీర్తిని ఆర్జించే మహత్తులా? శాశ్వత ఆనందాన్నిచ్చే ఆత్మజ్ఞానమునా?" అని ప్రశ్నించారు శ్రీ బాబు.




ఫిబ్రవరి 17న విశాఖపట్నంలో
జరిగిన
అఖిలాంధ్ర సాధుపరిషత్
సమావేశాలలో
ప్రసంగిస్తున్న శ్రీ మాతాజీ

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## దీక్ష ఎందుకు చేయాలి?

మనందరం దీక్షలు చేస్తున్నాము. 'దీక్ష' అంటే ఏమిటి? ఎందుకు చేయాలి? 'దీయతే విమల జ్ఞానం; క్షీయతే కర్మవాసనాః ఇతి దీక్షా' అంటే విమల జ్ఞానాన్ని ప్రసాదించి, కర్మవాసనలన్నిటినీ నశింపజేసేది దీక్ష. నీ జీవిత పరమార్థాన్ని గుర్తించటానికి నీకు దీక్ష కావాలి. నిన్ను నువ్వు మరచిపోతున్నావు కనుక నిజమైన ఆత్మ తత్త్వాన్ని గుర్తించటానికి ఇచ్చారు దీక్ష.



మనందరిలోనూ వినే శక్తిగా, చూసే శక్తిగా, చెప్పే శక్తిగా, నడిచే శక్తిగా, రుచి, స్పర్శ తెలిపే శక్తిగా వున్నది ఒకే శక్తి. అదే ప్రజ్ఞానం బ్రహ్మ. నాలో చెప్పే ప్రజ్ఞ, మీలో వినే ప్రజ్ఞ వుంది. నాలో చెప్పే ప్రజ్ఞ వున్నా కూడా ఏదో అడ్డుపడుతోంది. అంటే నా కంఠంలో శ్లేష్మం అడ్డుపడి మాటరావటం లేదు. అదే విధంగా, మనలోనే వున్న ఆ ప్రజ్ఞను తెలిసికోనీయకుండా మన మనస్సే అడ్డు పడుతోంది. ఈ అడ్డు తొలగించటానికి చేసే సాధనే 'దీక్ష' అంటే.

మనం దీక్ష చేస్తున్నామంటే, పథ్యం మన మనస్సు చేయాలి. అందుకనే మనం కొన్ని నియమాలు పెట్టుకుంటున్నాము. మనస్సు బజారుల వెమ్మట, బట్టల వెమ్మట పరుగులు పెడుతోందా? వేటి వేటి మీదకు దృష్టి వెడుతోందో మన మనస్సుని మనమే గమనించి, దానిని నియంత్రించాలి. నీ జీవిత పరమావధియైన లక్ష్యం తప్ప మిగతావాటిని అన్నింటినీ ప్రక్కకు నెట్టివేయాల్సిందే.

**గురుపుత్రులయినవారు ఒక్క 41రోజులు మనస్సును రాపిడి పెడితే అనంతమైన శక్తిని పెంపొందించుకుంటారు.**

మన జీవితాన్ని పరిమళం చేసుకుని గురుదేవులకు అర్పించటమే 'ఆరాధన'.

మన జీవిత పరమావధిని గుర్తించటానికి, సాధన చేయడానికి, సాధించడానికి అత్యంత ఆవశ్యకమైనది గురుబోధా శ్రవణము. **బోధ వినికిడి ద్వారానే బుద్ధి మారుతుంది.**

దివ్యత్వాన్ని నువ్వు అనుభవించాలి అనుకున్నప్పుడు నీ నడవడికలో మార్పురావాలి. ఆ మార్పు రావటానికే నువ్వు చేసే దీక్ష. దీక్ష వలన ఒక క్రమబద్ధమైన జీవనం మనకు అలవడుతుంది. ఉదయమే బ్రాహ్మీ ముహూర్త సమయానికి ముందే లేచి, చల్లని నీళ్ళు స్నానం చేయడం ద్వారా మనలో బద్ధకం, నిద్ర పటాపంచలయిపోతాయి. మనం ధరించే కాషాయ వస్త్రం త్యాగానికి గుర్తు. మనలోని గుణాలను, వాసనలను త్యాగం చేయమని చెబుతుంది. అంతేకాదు మనమేదైనా కాని పని చేయబోతే, 'ఒరేయ్! నువ్వు ధరించిన వస్త్రమేమిటి? నువ్వు చేయబోతున్న పనేమిటి?' అని ఆ వస్త్రం  మనలను హెచ్చరిస్తుంది.

ఆహార నియమాలు జిహ్వని కంట్రోల్ లోకి తీసుకు రావడానికి ఉపకరిస్తాయి. మన ఇంద్రియాలన్నిటినీ, వాటి మెయిన్ స్విచ్ అయిన మనస్సునీ అదుపులో తెచ్చుకోవటానికి దీక్ష ఉపకరిస్తుంది. మనం ఏ నియమాలు పెట్టుకుంటామో వాటిని అతిక్రమించరాదు. అనేకానేక కష్టమైన నియమాలు పెట్టుకుని బాధపడుతూ దీక్ష చేయకండి. మీరు చేయగలిగిన నియమాలనే చెప్పారు - వాటిని సరిగా చేయండి చాలు. కష్టమనుకుని చేయకండి. ఇష్టంగా చేయండి. అట్టి దీక్షా ధైర్యాలను, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!



మెట్‌పల్లిలో ఫిబ్రవరి 2 నుండి జరిగిన భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి 400వ సత్సంగసమావేశంలో పాల్గొన్న శ్రీమాతాజీ

# జీవన్ముక్తి

- రమణ ప్రసాద్

జీవన్ముక్తి అంటే ఏమిటి? అది సంభవమేనా? దానిని పొందటం ఎలా? అనే ప్రశ్నలు చాలామంది వేస్తారు.

"జీవనం"అంటే జీవించి ఉండటం. (మరణానికి వ్యతిరేకం) "ముక్తి" బంధంనుండి విడివడటం. మానవులు తమ అలవాట్లకు బానిసలై బంధంలో పడుతున్నారు. అటువంటి అలవాట్లనుండి బయటపడటవే ''జీవన్ముక్తి''. అతనిని విషయాదులు బంధించలేవు. అతడు ముక్తుడు. మానవుడు అట్టి స్థితిని పొందవచ్చును. అదే మన సహజస్థితి. సద్గురువు అనుగ్రహంతో, తదేక నిష్ఠతో, సాధుజన సాంగత్యంతో సాధించ వచ్చును. ముఖ్యంగా కావలసినది దాని యందు ఆవేదన, శ్రద్ధ, తత్పరత.



మనం ముక్త పురుషులమే. అయితే బంధం ఎక్కడనుంచి వచ్చింది? ఒకదాని వెంట ఒకటి నడిచే గొఱ్ఱెలమందలాగా మనం అందరూ ఏది చేస్తే దానినే అనుసరించే స్వభావం వల్ల. బుద్ధిజమ్, క్రిష్టియానిటీ, ఇస్లాం, హిందూయిజమ్ తదితర మతాలు ఎలా వచ్చాయి అంటే అవి మానవుని అనుకరణ సరళి వల్లనే వచ్చాయి. ఏది సత్యం? ఏది నిత్యం? అనే వివేకం లేకుండా గుడ్డిగా అనుకరించటమే దీనికి కారణం. కాబట్టి స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా, వివేకవంతంగా ఉండే ఆలోచనా విధానాన్ని అలవరచుకోవాలి. గుడ్డిగా జనం ఎటువెళ్తే వారి వెనక వెళ్ళటం మానుకోవాలి. అవి ప్రపంచ విషయాలు కావచ్చు, ఆధ్యాత్మిక విషయాలు కావచ్చు.

మానవుని ధ్యేయం ఏమిటి? సుఖం, ఆనందం. మరి ఎందుకు పొందటం లేదు? అంటే మనం ఆనందాన్ని ఏదో ఒక వస్తువు నుండి పొందాలని చూస్తున్నాం. భార్యాబిడ్డలు కావచ్చు, భోగభాగ్యాలు కావచ్చు, కీర్తి ప్రతిష్టలు కావచ్చు. నిజమైన ఆనందం మనం ఇప్పుడే, ఇక్కడే పొందగలగాలి. దేశ కాలాదులతో కట్టుబడి, విషయవాంఛలలో పడి మనం ఆనందానికి దూరమవుతున్నాం. బంధానికి గురి అవుతున్నాం.

ఏ కర్మ చేయకపోయినా, ముక్కు మూసుకుని కూర్చున్నా, కళ్ళు మూసుకొని (లేదా కళ్ళు సగం తెరచి) జపం చేసినా మనం బంధంలో ఉన్నట్లే. **మరి ముక్తి అంటే ఏమిటి? ఎలా వస్తుంది?** - దీనికి సమాధానం చాలా సులభం. మనం మన అలవాట్లకు లొంగి, మన కోరికలు తీరక మనం దుఃఖాల పాలవుతున్నాం. ఆ అలవాట్ల నుండి మనం విడివడాలి. ఏది వున్నా, ఏది లేకపోయినా, దొరికిన దానితో తృప్తిపడి ప్రశాంత జీవనాన్ని గడపటం అలవరచుకోవాలి. దేశ కాలాలతో, వ్యక్తులతో ముడివడని అవధి లేని ఆనందాంబుధిలో ఉండటమే "జీవన్ముక్తి".

పవిత్ర గంగానది నిరంతరంగా ఏ ఆటంకం వచ్చినా ఆగకుండా ప్రవహిస్తూ ఉంటుంది. గడియారం ముల్లు అవిరామంగా తిరుగుతుంది. సూర్యుడు తన గమనాన్ని ఎప్పుడూ ఒకే రీతిలో చేస్తూ ఉంటాడు. అది మారితే ప్రళయమే. మొక్కలు పెరిగి పుష్పించి ఫలాలను, బీజాలను సహజంగా అందిస్తాయి. అలాగే జంతువులు, పక్షులు తమ తమ సహజమైన విధానంలో జీవనం గడుపుతాయి. ఇలా అవి గడిపే జీవనానికి ఏ బంధాలు లేవు. ఏ బంధాలు లేని జీవితాన్ని గడపటమే "జీవన్ముక్తి". అలా కాక పరిస్థితుల ప్రభావంలో చిక్కుకుని దుఃఖంలో పడటమే బంధం. ఈ బంధాలన్నీ మానవుడు కొని తెచ్చుకొన్నవే కనక ఈ బంధాలనుండి విముక్తి తప్పకుండా పొందగలడని నిర్ధారణగా చెప్పవచ్చు. ధనాన్ని సంపాదించి దాచుకోవచ్చు. కావాలంటే దాన్ని ఖర్చు పెట్టుకోవచ్చు. అలాగే మనకి కలిగే సుఖ దుఃఖాలలో మునిగి దారి తెన్ను లేని స్థితిలో ఉండవచ్చు. కాని వివేక విచారణ చేసి వాటినుండి బయట పడవచ్చు. ఆ శక్తి మనందరిలో నిక్షిప్తమై ఉంది.

**మానవుని దుఖాల పాలు చేసే కొన్ని శక్తులు :**

1) మానవునిగా పుట్టి దేహ భావన వల్ల జనన - మరణ వలయంలో పడటం.
2) ప్రపంచ విషయాలతో సంయోగ వియోగం.
3) ఇంద్రియ సుఖాలలో పడి దిగజారిపోవటం.
4) మంచి - చెడులను గుర్తించకుండా ప్రవర్తించటం.
5) కామ వాసనతో తాత్కాలిక సుఖాలకు వెంపర్లాడి దుఃఖాలపాలవటం.
6) సత్కర్మ, దుష్కర్మల ఫలితమే మరణానంతరం స్వర్గ నరకాలకు తీసుకొని వెళ్తుంది.
7) ధనవంతులం కావాలనే కాంక్షతో చేసే కర్మల వల్ల మిత్రత్వ - శత్రుత్వాలు కలుగుతాయి.

-సశేషం

# నీ జీవిత నిర్మాతవు నీవే

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

**(శ్రీ మాతాజీవారి ధనుర్మాస ప్రసంగాల నుండి)**

ప్రభావతమ్మగారు మెట్లమీద కూర్చునేవారు. శ్రీబాబు ఎక్కేటప్పుడో, దిగేటప్పుడో పలకరించేవారు -' ఏమ్మా! పాలు పోస్తున్నావా?' (అప్పుడు పాల డిస్ట్రిబ్యూషన్ సేవ ఆమె చేసేవారు). అవన్నీ ముద్రలే. అలా మన బాగోగులు చూసేవారు శ్రీ బాబు. వారి పాదం పట్టినవారికి అటువంటి ఆత్మీయత, సద్గురు సన్నిధానం తప్పక లభిస్తుంది.

అందుకని ఎవ్వరూ బొట్టు, కాటుక పెడతారని అనుకోకండి. అసలు వాళ్ళు అలా అతుక్కుపోయారంటే, వాళ్ళు ఏదో అలౌకిక ఆనందం పొందబట్టే కదా! కోటీశ్వరులైనా సరే రావాల్సిందే. వారికి ఏ రుగ్మత వచ్చినా నాకు ఫోన్ చేస్తారు. నేను కనెక్షన్ బాబుకి పెట్టి, వారికి కావల్సింది చేస్తాను. వారికి ఉపశమనం కలుగుతుంది. ఆ విధంగా వారికి బాబు స్మరణ అవుతుంది. వారు చేసే దీక్షలతో బాబు పారాయణ అవుతుంది. బాబు ఒక రూపం కాదు. వారు నిరాకారులు. అన్నీ తానై నడిపించే చైతన్య శక్తి అది. మనం ద్వంద్వంగా చూస్తే అది మనస్సు లక్షణం.

ఇంతకీ విషయంలోకి వద్దాం. ఎవరో పిలుస్తారు అనుకోకండి. మనకికూడా తెగింపు ఉండాలి. నాకు వివాహం చేయాలని ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. శ్రీ బాబు రెండు వేళ్ళు తెరిచి ఏదో ఒక వేలు పట్టుకోమనేవారు. నాకు తెలుసు జరిగేదేమిటో. పెళ్ళి చేసి పంపటం ఏం కష్టమండీ! ఉంచుకోవటం అంటే కష్టం గాని. శ్రీబాబు పరీక్షలకు నిలబడ్డాను. వారు పెట్టిన పరీక్షలలో వారే మనలను గెలిపిస్తారు. నన్నెవరూ ఇక్కడికి రమ్మని చెప్పలేదు. నేనే వారి సన్నిధికి చేరాను.

శ్రీబాబు వద్ద నేర్చుకోవాల్సింది చాలా ఉంది. మొదటిది - పొదుపు - మేము ఒకసారి శ్రీ నారాయణరావుగారింటికి వెళ్ళాం (హైదరాబాద్‌లో) శ్రీ బాబు స్నానం చేసిరాగానే వారి బట్టలు పిండి ఆరవేసేవాళ్ళం. శ్రీ నారాయణరావుగారు నన్ను అడిగారు. 'బాబు పెట్టెలో ఏమున్నాయి?' అని. నేను,'బట్టలు' అన్నాను. మరి అన్ని బట్టలుంటే వారి పంచె వెంటనే

ఎందుకు ఉతుకుతున్నావు?' అని. ఏం చెబుతాం?

ఇక రెండవది - నిరాడంబరత - కాశీ యాత్ర చూసుకుని గంగా కావేరీ ఎక్స్‌ప్రెస్‌లో రామేశ్వరానికి వెళ్తూ మదురై చేరాం. అక్కడ రిటైరింగ్ రూములో బస చేశాం. అది పెద్ద రూము. ఒక్కటే ఫ్యాను. పైన బరా బరా తిరుగుతోంది. శ్రీ బాబు స్నానం చేసి ,'అమ్మడూ! పంచె పిండుకొస్తావా? నేను అనుష్ఠానం చేసుకుంటాను' అన్నారు. ఎక్కడ ఆరేద్దామా అనుకొనేంతలోపలే వారు, 'ఒక వైపు నువ్వు పట్టుకో, ఇంకొకవైపు నేను పట్టుకొంటాను' అన్నారు. బట్ట ఆరేంతవరకు భగవన్నామం, భగవతత్త్వం చేశాం. ఆ పంచె ధరించిన తరువాత మీనాక్షి అమ్మవారి దర్శనానికి వెళ్ళాం. ఇది మనకి చూపించటానికి అలా చేశారు. యాత్రలో ప్లాట్‌ఫారమ్ మీద రాత్రి కాపలా కాసేవారు. బాబూజీకి అన్ని ఏర్పాట్లు ఉండేవి, అంటే -మడత మంచం, పడక కుర్చీ, బ్యాటరీ లైట్ అన్నీ సర్ది ఉంచేవారు. అప్పటినుంచి, ఇప్పటి వరకు వారు మనకి కాపలా కాస్తూనే ఉన్నారు. ఆ భగవంతుడు, 'మీరుండండిరా! నేను రెస్టు తీసుకొంటాను' అని అంటే మనకి ఉనికి ఉంటుందా? అలా మనకి శక్తినిస్తూ, మనకి ఆధారమై ఉన్న శ్రీ గురుదేవుల అండ దండలలో మన జీవితాలు నడుస్తున్నాయి.

కాబట్టి ఎవరో పిలుస్తారనుకోవద్దు. ఆ ఆవేదన మనకి ఉండాలి. మన జీవితం కాయ అయి ఉన్నదా?పండి భగవదర్పితం చేయటానికి రెడీగాఉన్నదా? అని విచారణచేయాలి. ఆ పండును స్వీకరించటానికి రెడీగా ఉంటారాయన. సాధనలో అడ్డంకులు వస్తాయి. దీక్షను విడవకూడదు. ఎవరేమన్నా లొంగకూడదు. భగవత్సేవకు ఉపయోగ పడేటట్లు మనకి మనం సరిదిద్దుకుంటున్నామా లేదా అని విచారణ చేయాలి. మేము వడ్డనలో విస్తళ్ళు వేయటం. మంచినీరు పోయటం వంటి సేవలు చేశాము. అప్పట్లో 'ఆఫ్టరాల్' అనిపించేది. ఇప్పుడు ఆ విధంగా సేవ చేశామన్న తృప్తి మిగిలింది. లోతుకి వెళ్ళి విచారణ చేస్తే గురుతత్త్వం మీకు కరతలామలకమవుతుంది. అటువంటి భక్తిని శక్తిని అఖండ ఆత్మానందానుభూతిని శ్రీ గురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక! సుఖీభవ!

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

## జ్ఞాన ఖండం

ఈ ఉపదేశాన్ని విన్న పరశురాముడు, దత్తాత్రేయుని ఇలా అడిగాడు- " భగవన్! అష్టావక్రుడు జనకమహారాజుని ఏమని అడిగాడు?" దత్తాత్రేయుడు "చెప్తాను. శ్రద్ధగావిను"- అష్టావక్రుడు, జనకునితో రాజా! తాపసి సంక్షేపంగా చెప్పిన ఆత్మ స్వరూపాన్ని బోధించండి" అని అడిగాడు. జనకుడు - మునిపుత్రా!శుద్ధచితి పూర్తిగా జ్ఞేయమూకాదు. అజ్ఞేయమూ కాదు. తెలిసిన గురువు బోధింపగలుగుతాడు. ఆ ఆత్మతత్త్వం అతి కష్టమూ, అతి సులభమూ. బహిర్ముఖ దృష్టి కలవానికి అతి దుర్లభం. అంతర్ముఖ దృష్టి కలవానికి ఈ జ్ఞానం అతి సులభం. ఉపాధి రహితంగా అన్నిటిలో వున్న జ్ఞానం చితి యొక్క నిజ స్వరూపం. ఒకే అద్దం బింబాల ఆకారంలో అనేకంగా కనపడుతుంది. ఆ విధంగా ఒక చితియే దృశ్యాల ఆకారంలో అనేకంగా కనపడుతుంది. అపరిచ్ఛిన్నమైన చితిని "ఇది" అని చూపించలేము. శుద్ధచితి తెలుసుకునేవాడి రూపమే అయినప్పుడు, అది తెలియబడేది ఎలా అవుతుంది? ఆత్మగా భాసించే దేహాదులన్నిటినీ, ఇది ఆత్మ కాదు" అని నిషేధించగా మిగిలేదీ, స్వప్రకాశము అయినదేదో అదే నీ నిజ స్వరూపం. అదే చితి. ఇలా విమర్శించి నీ నిజ స్వరూపాన్ని గుర్తించు.



శరీరం, ప్రాణం, మనస్సు అస్థిరాలు. నా శరీరం, నా ప్రాణం అంటున్నావు. అన్నిట్లో "నేను"అనే "నీవు" స్థిరంగా ఉన్నావు. అదే స్వప్రకాశమైన ఆత్మ. ఆ పరాచితియే నీవు. అష్టావక్రా! లోచూపుతో "నేను కేవలం చితినే " అని అనుభవపూర్వకంగా తెలుసుకో.

శుద్ధమైన మనస్సు మాత్రమే చితిని భాసింపజేస్తుంది. అప్పుడే పుట్టిన శిశువుకు ఏదీ భాసించదు. కాని మసి పూసిన అద్దంలో, మనకు కనపడని మసి యొక్క ప్రతిబింబంకూడా ఉంటుంది. అలాగే నిద్ర మనస్సును కప్పి వేస్తుంది. అప్పుడు మనస్సు నిద్రాకారమవుతుంది. అందువల్లనే నిద్రనుండి లేచిన తరువాత,"నాకేమీ తెలియలేదు" అంటున్నాము. సమాధి, సుషుప్తులకు భేదం ఉంది.

-సశేషం

# ఉద్ధలక అరుణి – శ్వేతకేతు

- గాలి జగదీశ్

ఉద్ధలక అరుణి గొప్ప పేరు పొందిన ఋషి. ఆయనకు శ్వేతకేతు అనే కుమారుడుండేవాడు. అతనికి 12 సంవత్సరములు రాగానే తండ్రి అతనిని గురువు వద్దకు పంపి సకలశాస్త్రములు అభ్యసించమని పంపించాడు. వారిది బ్రాహ్మణ వంశం. వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని అభ్యసించటమేకాక, అన్ని విద్యలలో కూడా మంచి ప్రావీణ్యం కలిగి వున్నారు.

కుమారుడు తండ్రి చెప్పినట్లు గురువు వద్దకు వెళ్ళి సకల విద్యలు నేర్చి 12సంవత్సరాల తరువాత తిరిగి వచ్చాడు. శ్వేతకేతు తనకు సకలము తెలుసుననే అహంకారంతో విఱ్ఱవీగ సాగాడు. మొండి ప్రవర్తన కూడా అలవడింది. అది తెలిసి తండ్రి అతనిని సన్మార్గంలో పెట్టదలచి, నీవు అన్ని విద్యలలో ఆరితేరినవాడవని అనుకుంటున్నావు కదా! అయితే నా యీ ప్రశ్నలకు సామాన్యమైన సత్యమేదో నేను నీ నుండి తెలుసుకోవాలి అనుకుంటున్నాను. అవి .....

1. నీవెప్పుడూ వినలేదు, కానీ అది సత్యము.
2. నీవెప్పుడూ ఊహించలేదు, కానీ అది సత్యము.
3. నీవెప్పుడూ చూడలేదు, కానీ అది సత్యము.

“నాన్నగారూ! గౌరవనీయులైన మా గురువుగారెప్పుడూ నాకు ఈ విషయాలు చెప్పలేదు. బహుశ వారికి కూడా ఇవి తెలియదని నేను అనుకుంటున్నాను. ఎందుకంటె ఆయనకు తెలిస్తే తప్పక నాకు చెప్పి వుండేవారే. దయచేసి మీరే నాకు సమాధానాలు చెప్పండి” అని శ్వేతకేతు వినయంగా తండ్రిని అర్థించాడు.

అప్పుడు ఉద్ధలక అరుణి  ఈ విధంగా చెప్పసాగాడు ... “మొత్తం సృష్టి అంతా పరమాత్మ నుండి ఉద్భవించింది. మొట్టమొదట పరమాత్మ తప్ప రెండవది లేదు. ఆయనే సర్వత్రా వ్యాపించి వున్నాడు. మానవులలో ఆత్మ (జీవాత్మ) రూపంలో వున్నాడు. (ఆ జీవాత్మ) వాడే పరమాత్మ యొక్క ప్రతిరూపం. ఆఖరున ఈ జీవాత్మ పరమాత్మతో ఏకమవుతుంది. భగవంతుడు ఉనికి సర్వత్రా వ్యాపించి వుండటం వలన దానికి మొదలు, తుది లేవు. ఆయన సూక్ష్మ రూపంలో ప్రతి జీవిలో చెట్టు, జంతు జాలాలలో, మానవునిలో, పశుపక్ష్యాదులలో అన్నింటిలోనూ వ్యాపించి వున్నాడు. అదే

నీవు వినని సత్యం.

శ్వేతకేతును అక్కడున్న మర్రిచెట్టు నుండి ఒక పండును తీసుకుని రమ్మనమన్నాడు అరణి. తీసుకువచ్చాక దాన్ని రెండు ముక్కలు చేసి లోపల ఏమున్నదో చూడమన్నాడు. దానిలో చిన్నచిన్న విత్తనాలు వున్నాయని చెప్పాడు శ్వేతకేతు. వాటిలో నుండి ఒక విత్తనాన్ని తీసి మరల దాన్ని విరచి చూడమన్నాడు అరణి. చూస్తే దానిలో ఏమీ కనబడలేదని చెప్పాడు శ్వేతకేతు. దానికి జవాబుగా అరణి "నీవు ఏమీ లేదని చెప్పావు. కానీ అందులో మర్రిచెట్టనే మహావృక్షం సూక్ష్మరూపంలో ఆ విత్తనంలో దాగి వున్నది. అదే నీవెప్పుడూ ఊహించలేని సత్యము" అన్నాడు.

తిరిగి అరణి ఒక గ్లాసు నీటిలో ఒక ఉప్పు కణికవేసి రేపు ప్రొద్దుటే తన దగ్గరకి తీసుకు రమ్మన్నాడు. శ్వేతకేతు అలాగే చేసి తీసుకు వచ్చాడు. అరణి అతనిని నిన్న ఆ గ్లాసులో వేసిన ఉప్పు కణికను బయటకు తీయమని చెప్పాడు. కాని శ్వేతకేతు అలా తీయలేకపోయాడు. అది నీటిలో కలసి పోయింది. అప్పుడు అరణి "పోనీ నీవు ఆ ఉప్పు కణికను చూడగలుగుతున్నావా?" అని అడిగాడు. దానికి శ్వేతకేతు లేదని చెప్పాడు. "పోనీ దాని రుచి చెప్పగలవా?" అన్నాడు. దాన్ని అన్నివైపుల నుండి రుచి చూసి ఉప్పగా వున్నదని చెప్పాడు శ్వేతకేతు.

అప్పుడు అరణి "కుమారా! ఏవిధంగా నువ్వు ఉప్పు కణికను నీటిలో చూడలేకపోతున్నావో, అదే విధంగా నీలోనే వున్న పరమాత్మను నీవు చూడలేకపోతున్నావు. ఆయన సూక్ష్మరూపంలో వున్న జీవాత్మ. పరమాత్మ యొక్క ప్రతిరూపమే. అదే సత్యము" అని వివరించాడు.



ఫిబ్రవరి 9న కామేపల్లి గ్రామంలో శ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామి వారి భక్తమండలి 23వ వార్షికోత్సవ సందర్భంగా అమ్మవారికి జరిగిన లక్షచామంతి పుష్పార్చన, సామూహిక పూజలు.

# అడియేన్ - దాసోఽహమ్

- సంపత్

గోపబాలుడైన శ్రీ కృష్ణుడు మహా అల్లరివాడు. ఆయనకు వెన్న అంటే ఎంతో ఇష్టం. ఆయనకు వెన్న తినటం ఎంత ఇష్టమో, పది మందికీ పంచిపెట్టటం కూడా అంతకంటె ఎక్కువ ఇష్టం. ఏడేడు పధ్నాలుగు లోకాలలోని వాళ్ళందరి కోరికలు తీర్చే ఆ ప్రభువును తృప్తి పరచగలిగేటంత వెన్న ఆ యశోదమ్మ తల్లి మాత్రం ఎక్కడి నుంచి తేగలదు? ఆమె పెట్టే వెన్న ఎలాగూ చాలదు. మరి ఇహ వ్రేపల్లెలో గోపమ్మల ఇళ్ళల్లో వెన్న దొంగిలించక తప్పుతుందా ఆ ఒప్పుల కుప్పకు!

అందుకని ఆ వెన్నల దొంగ ఒక ఉపాయం ఆలోచించాడు. తన తోటి గోపబాలురందరినీ పోగు చేశాడు. చడీచప్పుడూ లేకుండా ఒక్కొక్క యింట్లో దూరడం, ఆ బాలురందరినీ ఒకరి వీపు మీద మరొకరిని ఎక్కించి, వారందరి కంటె పైకి తాను ఎక్కి, తన చిన్నారి చేతులతో ఆ ఉట్టిలోని వెన్నను అందుకోవటం. అలా దొంగిలించిన వెన్నను తోటి వారందరికీ తిన్నంత తినిపించడం, తానూ ఆరగించడం, గులాబీ మొగ్గల లాంటి లేత బుగ్గలు చొట్టపడేటట్లు చిరునవ్వులు చిందించడం, ప్రకృతిలోని జీవరాసులన్నిటినీ కూడా మైమరపింపచేయటం. గోపికలకు టోపీ బాగానే పడింది.

ఇలా కొంతకాలం సజావుగా వెన్న దొంగతనం సాగింది. కానీ ఒక రోజు ఒక గోపిక ఈ వ్యవహారం అంతా పసికట్టింది. ఒక పథకం వేసింది కన్నయ్యను పట్టుకోవటానికి. ఆ కుండకు ఒక చిన్ని గంట కట్టింది. వెన్న కుండ ముట్టుకుంటే చాలు ఆ గంట మ్రోగుతుంది. దొంగ దొరికేస్తాడు! ఇంకెక్కడకి పారిపోతాడు?

అయితే ఆ టక్కరి కన్నయ్యకి తెలియదా? ఆ గంటతోనే బేరం ఆడటం మొదలు పెట్టాడు. "ఓ గంటా! నీకు ఇంతకాలం నేను మేలు చేశాను కదా! మరి నువ్వు నాకు అపకారం చేస్తావా?" అన్నాడు. "తమరు నాకు చేసిన మేలు ఏమిటి?" అని తిరిగి ప్రశ్నించింది ఆ గంట. "నాకు ఎవరు నివేదన చేసినా నిన్ను మ్రోగించనిదే నేను ఆహారం తీసుకోను కదా. చూడు! మరి నీకు ఎంత ప్రాముఖ్యతనిచ్చానో!" అన్నాడు కన్నయ్య. వెంటనే గంట "నిజమే! నిజమే! మరి ఇప్పుడు నేను మీకు చేయగల సహాయం ఏమిటో చెప్పండి?" అన్నది. "ఏమీ లేదు. నేను వెన్న కుండ తాకినప్పుడు దయచేసి నీవు మ్రోగవద్దు" అన్నాడు కన్నయ్య. "అడియేన్"

అన్నది గంట. అడియేన్ అంటే తమిళంలో 'నేను మ్రోగను' అని అర్థం.

కృష్ణుడు చాలా సంతోషించాడు. యథాప్రకారం గోప బాలురు అందరినీ పోగుచేశాడు. వెన్నకుండ అందుకున్నాడు. కాస్తవెన్నతీసి నోట్లో పెట్టుకున్నాడో లేదో గంట గణగణమని మ్రోగింది. మాగన్నుగా నిద్ర పట్టిన ఆ గోపిక మత్తు వదలి లేచివచ్చి కన్నయ్యను పట్టుకుంది. మిగతా వాళ్లంతా పారిపోయారు.

అప్పుడొక తమాషా జరిగింది. భయం నటించే ఆ నటన సూత్రధారి అయిన ఆ నల్లనయ్యను ఒళ్లో కూర్చోబెట్టుకుని, తానే ఆ చిన్నరి కన్నయ్యకు స్వయంగా వెన్నతినిపించ సాగింది. చందమామ లాంటి కన్నయ్య ముఖంపై ముద్దులొలికే ఆ ముంగురులు సవరిస్తూ తనను తాను మైమరచిపోయింది. నోట్లో పెట్టిన ఆ వెన్నను తినకుండా తనవంకే భయంగా చారడేసి కళ్లేసుకుని చూస్తున్న ఆ నవనీత చోరునితో ఆ నవయౌవనాంగి యిలా మనవి చేసుకుంది "నంద నందనా! యశోద అనుదినమూ పొందుతున్న ఆ మహద్భాగ్యాన్ని నేను కూడా పొందాలనీ, ఆ ఆనందాబ్ధిలో ఓలలాడాలనీ కోరికతో నేను యిలా చేశాను. దానికి ఈ గంట కూడా నాకు ఎంతో సహాయపడింది. నా కోరిక సఫలమైనది. నా జన్మ ధన్యమైనది. కృష్ణా! నీకెంతో కృతజ్ఞురాలిని" అన్నది ఆ గోపిక. తన దరహాసకుసుమాలతోపాటు తన ఆశీస్సులను కూడా అందించాడు ఆ వెన్నదొంగ.

ఇక తనను మోసగించిన గంటవైపుకు తిరిగి ఆ యశోదా నందనుడు చిరుకోపం నటిస్తూ "మాట తప్పావు కదూ! టక్కరి గంటా?" అని అడిగాడు. దానికి ఆ గంట "లేదు ప్రభూ! తమకు మాట ఇచ్చిన తరువాత ఎలా తప్పగలను?" అన్నది వినయంగా. "మరి అడియేన్ అన్నదానివి ఎందుకు మ్రోగావు?" అని అడిగాడు కన్నయ్య.

"దేవదేవా! తమరు కుండను తాకినప్పుడు మ్రోగవద్దు అన్నారు. నేను మీరు దాన్ని తాకినప్పుడు మ్రోగలేదు కదా! మీరు నివేదన చేసుకునే టప్పుడు నేను మ్రోగకుండా ఎలా ఉండగలను? నేను మ్రోగక పోతే మీరు నివేదన చేసుకోరు కదా! పైగా, నేను అడియేన్ అన్నది 'దాసురాలిని ప్రభూ!' అని మనవి చేసుకోవటానికిగాని, 'నేను మ్రోగను' అనే ఉద్దేశ్యంతో కాదు ప్రభూ!" అన్నది ఆ చిలిపి గంట. (అడియేన్ అన్న మాటకు తమిళంలో దాసోహం అనే అర్థం కూడా ఉన్నది.)

గంట గడుసుదనానికి మురిసిపోయాడు వెన్నదొంగ కన్నయ్య.

(గత సంచిక తరువాయి)

# త్యాగ మహిమ

- మురళీ

మంత్రి రాజాజ్ఞ ప్రకారం లంకకు చేరుకుని రావణుని సభకు వెళ్ళి వినయంతో, సభ్యతతో చక్ర్వేణ మహారాజు సందేశాన్ని వినిపించాడు. ఆ సందేశాన్ని వినగానే రావణుడు నవ్వి 'ఇలాంటి మూర్ఖమైన రాజులు ఈ లోకంలో ఇంకా ఉన్నారు. ఋషులు, దేవతలు, రాక్షసులు మొదలైన అందరి నుండి పన్నులు తీసుకునే నా లాంటి బలవంతుడు, సర్వతంత్రుడు, అయిన మహా సామ్రాట్టు నుండి పన్ను తీసుకోవాలని ఆశ పడుతున్నాడా?' అని చక్ర్వేణ మహారాజు మంత్రిని బంధించ మన్నాడు. రాజ సభలోని అందరి విన్నపముతో తిరిగి ఆ మంత్రిని విడిచి పెట్టాడు. మంత్రి తిరిగి సముద్ర తీరానికి చేరుకున్నాడు.

తరువాత రాత్రి సమయంలో మండోదరి దగ్గరకి వెళ్ళినప్పుడు రావణుడు వినోదంగా ఈ విషయాన్ని మండోదరికి చెప్పాడు. మండోదరి బాధపడి 'స్వామీ! మీరు చాలా తప్పు చేశారు. చక్ర్వేణుడు గురించి నాకు బాగా తెలుసు. అతడు ధర్మము తెలిసినవాడు, సత్యవాది. అతని చక్రం నడుస్తూనే వుంటుంది. అతని ఆజ్ఞను పాటించని వాడికి అనిష్టం కలుగుతుంది. ఇప్పటికైనా అతని దూత ఆచూకి తెలుసుకుని, అతన్ని సంతోషపెట్టి పంపించండి. లేకపోతే మనకు ఎంత అనిష్టం కలుగుతుందో చెప్పలేము' అని పలికింది. 'నీవు చాలా పిరికిదానివి. మామూలు మనుష్యుల గురించే ఇంతగా భయపడుతున్నావు. నేను ఏ మాత్రము లెక్కచేయను' అన్నాడు రావణుడు. 'చక్ర్వేణ మహారాజు ప్రభావాన్ని మీకు రేపు ఉదయం చూపించగలను' అన్నది మండోదరి.

మరునాడు ఉదయం రావణునితో కలసి మండోదరి భవనం పైకి వెళ్ళింది. ప్రతిరోజూ మండోదరి అక్కడి నుండి వేసే దానిమ్మ గింజలను తినడానికి చాలా పావురాలు వస్తుంటాయి. మండోదరి గింజలను వేస్తూ పక్షులతో అన్నది 'ప్రభువు రావణుని ఒట్టు ఇది. జాగ్రత్త! మీరు ఈ గింజలను తినవద్దు' అన్నది. కానీ పావురాలు ఆపకుండా గింజలను తింటూనే వున్నాయి. అప్పుడు మండోదరి 'చూడండి మహారాజా! మీ ఎదుటనే, మీ పేరు చెప్పినా కూడా ఈ పక్షులు భయం లేకుండా, ఆపకుండా గింజలను తింటూనే వున్నాయి' అన్నది. రావణుడు

'మూర్ఖురాలా! ఇవి అమాయకమైన పక్షులు. వాటికేమి తెలుస్తుంది?' అన్నాడు.

అప్పుడు మండోదరి 'ఇప్పుడు చక్రవేణుని ప్రభావం చూడండి' అన్నది. ఆమె తిరిగి ఆ పక్షులతో 'పక్షులారా! ఇది చక్రవేణుని ఒట్టు. జాగ్రత్త! ఈ గింజలను ఎవరూ తినరాదు' అన్నది. వెంటనే ఆ పక్షులన్నీ గింజలను తినటం మానివేశాయి. ఒక చెవిటి పావురం ఆ గింజలను తినటం వలన దాని తల తెగి క్రిందపడిపోయింది. మండోదరి రావణునితో 'చూడండి మహారాజా! పక్షులన్నీ చక్రవేణుని ఒట్టు అనేసరికి గింజలను తినటం మానివేశాయి. ఈ ఒక్క పావురం చెవిటిది అయినందున ఒట్టు వినబడక తిన్నది. అందువలన చక్రవేణుని చక్రంతో దీని తల తెగి క్రిందపడింది.' అని చెప్పి, తిరిగి పక్షులతో, 'ఇప్పుడు నేను చక్రవేణుని ఒట్టును తీసివేస్తున్నాను. మీరంతా గింజలను తినండి' అన్నది. అనగానే పక్షులన్నీ తిరిగి గింజలను తినసాగాయి. మండోదరి రావణునితో 'చూడండి ఈ పక్షులపై ఎదురుగా వున్నా మీ ప్రభావమేమీ లేదు. కాని ఎదురుగా లేకున్నా చక్రవేణుని ప్రభావమెంత ఉందో!' అని పలికింది. రావణుడు ఒప్పుకోకుండా 'దీంట్లో నీ మాయ ఏదో ఉంది. లేకపోతే అమాయకమైన పక్షులకేమి తెలుస్తుంది?' అని మండోదరి మాటలను లక్ష్య పెట్టకుండా రాజ్యసభకు వెళ్ళిపోయాడు.

చక్రవేణుని మంత్రి నదీ తీరాన ఒక నకిలీ లంకను సృష్టించాడు. నల్లని మట్టిని సముద్రజలాలతో కలిపి ఒడ్డున వున్న ప్రదేశాన్ని సమతలంగా చేసి, దానిపై చిన్న నకిలీ లంకానగరాన్ని తయారుచేశాడు. మట్టి ముద్దలతో కోటను, ముఖ్యద్వారాలను, భవనాలను, బురుజులను, తోరణాలను తయారుచేశాడు. తరువాత మళ్ళీ రావణుని సభకు వెళ్ళాడు. అతడిని చూసి రావణుడు ఆశ్చర్యపోయి, 'నీవు మళ్ళీ ఎందుకు తిరిగి వచ్చావు?' అని అడిగాడు. మంత్రి 'మహారాజా! మీకు ఒక అద్భుతం చూపిద్దామనుకుంటున్నాను. నాతోపాటు నదీ తీరానికి రండి' అనడంతో రావణుడు కూడా ఉత్సాహంతో కొంతమంది సభ్యులతో కలసి సముద్ర తీరానికి వెళ్ళాడు.

-సశేషం

# శివుని కథలు

- రమణ ప్రసాద్

## సతి- శివుడు

శివ శక్తి ప్రకృతి శక్తుల కలయిక వల్లనే సృష్టి, స్థితి లయాలు జరుగుతున్నాయి. దానిని తెలిపేదేశివుడు సతిని పరిణయమాడిన గాథ. బ్రహ్మ సృష్టి కార్యక్రమం జరగటం కోసం పది మంది మానస పుత్రులను సృష్టించాడు. ఆ మానస పుత్రులలోని వారు శివుడు, దక్షుడు. శివుడు తనకన్నా శక్తిమంతుడు కావటం గిట్టని దక్షుడు అతడిని తన శత్రువుగా చూశాడు.



దక్షునికి ప్రసూతికి పుట్టిన పుత్రికయే సతి. ఆమెకు వారు “గౌరి” అని పేరు పెట్టారు. గౌరి (సతి) శివ భక్తురాలు. సౌందర్యవతి, సుగుణవతి. ఆమె ఎప్పుడూ శివుని గురించే ఆలోచించేది. ఆయన గురించే కలలు కనేది. ఆయననే తన భర్తగా నిర్ధారించుకొంది. ఆమె సర్వ దేవతల దీవెనలను పొంది శివుడినే తన భర్తగా పొందాలని కఠిన తపస్సు చేసింది. ఆమె తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమైనాడు. సతీదేవి నమస్కరించి ఆయనను ఎంతో స్తుతించింది. శివుడు ఆమె భక్తికి మెచ్చి వరం కోరుకోమన్నాడు. ఆమె తననే భర్తగా కోరుకుంటుందని తెలుసు. అయినా ఆమె నోట వినాలనుకొన్నాడు.

సతి సంకోచంతో,“ నాకు ఆయనే భర్తగా కావాలని ఎలా అడగను?” అనుకుని మౌనంగా ఉండిపోయింది. కొంత ధైర్యం తెచ్చుకొని,“స్వామీ! మీరు నన్ను...” అని ఆమె మాటలు పూర్తి కాకుండానే, “నిన్ను నా భార్యగా స్వీకరిస్తున్నాను” అన్నాడు శివుడు. ఆ తర్వాత శివుడు సర్వ దేవీ దేవతల సమక్షంలో ఆమెను వివాహం చేసికొన్నాడు. వివాహానంతరం ఆమెను తనతో కైలాసానికి తీసుకొని వెళ్ళాడు. కైలాసంలో వారు ఆనందంగా కాలం గడుపుతున్నారు.

ఒకనాడు శివుడు సతీదేవితో “దేవీ! ప్రయాగలో జరుగుతున్న యజ్ఞానికి నాతో నువ్వు వస్తావా? అని అడిగాడు. శివుడు యజ్ఞశాలలోకి

ప్రవేశించగానే అందరూ లేచి నుంచున్నారు. కొంతసేపటికి దక్షుడు ప్రవేశించాడు. శివుడు తప్ప అందరూలేచి నుంచున్నారు. దక్షుడికి అది తనకి అవమానంగా భావించాడు. "నా అల్లుడు నన్ను చూసి లేచి నుంచోలేదు. నలుగురిలో నాకు అవమానం జరిగింద"ని అనుకొన్నాడు. శివుడు, "నేను లేచి నుంచొని ఉంటే అది అతనికి హాని కలిగి ఉండేది" అని తను లేవలేదు.

అప్పటినుంచి శివుడిని అందరిలో అవమానం పాలు చేయటమే తన ధ్యేయంగా పెట్టుకొన్నాడు. వెంటనే ఒక పెద్ద యజ్ఞాన్ని తలపెట్టి, శివుడిని తప్ప అందరు దేవతలను ఆహ్వానించాడు. దేవతలందరూ ఆ యజ్ఞానికి తండోపతండాలుగా వెళ్తుంటే, "వాళ్ళు ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడిగింది. " 'వారందరూ మీ తండ్రి చేస్తున్న యజ్ఞానికి వెళ్తున్నారు" అన్నాడు శివుడు. "మరి మిమ్మల్ని ఎందుకు పిలవలేదు? మిమ్మల్ని అందరికంటె ముందుగా పిలివాలి కదా!" అని అడిగింది కోపంగా. "దక్షుడుకి నా పైన కోపం పెట్టుకొన్నాడు. అందుకు పిలవలేదు" అన్నాడు. "మీరు అనంత శక్తి సంపన్నులని, మిమ్మల్ని మించినవారు లోకంలో లేరని నా తండ్రికి తెలియదా?" "నువ్వు అన్నది నిజమే. కాని దక్షుడు నన్ను శత్రువుగా చూస్తాడు. "మనల్ని పిలిచినా పిలవలేకపోయినా మనం వెళ్ళాల్సిందే. ఇది నా తండ్రి తలపెట్టిన యజ్ఞం. నా తండ్రి ఇంటికి వెళ్ళటానికి నాకు ఏ ఆహ్వానం అవసరం లేదు." అన్నది.

"సరే! వెళ్ళు. నీకు నా ఆశీస్సులు. దక్షుడు నన్ను దూషించినా నువ్వు మౌనంగా ఉండు. తిరిగి ప్రతిఘటించకు. ఆ దూషణలు భరించలేకపోతే నీకు అపకారం జరగవచ్చు" అన్నాడు శివుడు. శివుని వాహనమైన నందిని అధిష్టించి సతీదేవి యజ్ఞ వాటిక చేరుకొంది. దక్షుడు ఇష్టం లేకపోయినా ఆమెను లోనికి రానిచ్చి, అందరిముందూ శివుడిని దూషించటం ప్రారంభించాడు. 'శివుడు పిశాచాల మధ్య తిరుగుతూ ఉంటాడు. శ్మశానమే అతని నివాసం. ఎప్పుడూ బూడిద పూసుకుని ఉంటాడు. అతడికి ఈ యజ్ఞానికి వచ్చే అర్హత ఎక్కడిదీ!" అని దూషణలు చేస్తుంటే తండ్రిని ఆపటానికి ప్రయత్నించింది. అతడు ఆగకుండా ఇంకా ఇలా అన్నాడు- "అతడు ధరించేది జంతు చర్మం. పాములు అతని ఆభరణాలు. ఎక్కడికి వచ్చినా వెర్రిగా తాండవం చేస్తాడ'ని

దూషిస్తుంటే సతీదేవి భరించలేకపోయింది. తనతో "నీ తండ్రి నన్ను దూషించినా నువ్వు  భరించు" అన్నశివుని మాటలు గుర్తుకొచ్చి మౌనంగా ఉండిపోయింది. ఆమె దక్షునితో ఇలా అంది, "నీ కుమార్తెను అని చెప్పుకోవటానికి నాకు సిగ్గుగా ఉన్నది. నా భర్తకు ఇచ్చిన మాట ప్రకారం నేను నీకు ఎట్టి హాని తలపెట్టటంలేదు. నేను ఈయాగ కుండంలో దూకి ప్రాణ త్యాగం చేస్తాను. వచ్చే జన్మలో నన్ను గౌరవించే తండ్రికి పుడతాను"అని అంటూ యోగాగ్నిలో దూకింది. దక్షుడు ఏమీ జరగనట్లే ఉండి, ఋత్విక్కులను యజ్ఞం కొనసాగించమన్నాడు.

నంది ద్వారా సతీదేవి మరణవార్త చేరగానే తన జటాజూటం లోని జడను పీకి నేలమీద టపీమని కొడితే  వీరభద్రుడు వుద్భవించి తన సేనతో వెళ్ళి దక్షుడిని అక్కడ యజ్ఞం చేస్తున్నవారిని  పరిమార్చి యజ్ఞాన్ని చెల్లాచెదురు చేశాడు. దక్షుడి తల ఖండించాడు. అందరూ భయంతో శివుని శరణు వేడారు. శివుడు ప్రపంచాన్నే నాశనం చేయటానికి పూనుకొన్నాడు. అప్పుడు బ్రహ్మాదులు అతనిని శాంత పరచి మరణించిన వారిని బ్రతికించమని వేడారు. శివుడు వారినందరినీ బ్రతికించాడు. దయాళువైన శివుడు దక్షునికి గొర్రెతల అతికించి అతడిని బ్రతికించాడు. దక్షుడు శివుని కాళ్ళపై పడి క్షమాభిక్ష వేడాడు. శివ భక్తుడుగా మారాడు.

శివుడు దుఃఖంతో గౌరిని తన భుజాలపైన పెట్టుకుని పరిగెడుతుంటే, దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థించగా, విష్ణువు శివుడిని శాంత పరచటానికి గౌరి శరీరాన్ని 51 ఖండాలుగా చేశాడు.  అవి ఉత్తరోత్తర శక్తి పీఠాలుగా ప్రసిద్ధి పొందాయి.

శివుడు సతీవియోగాన్ని  దిగ మ్రింగి కఠోర తపస్సు చేస్తూ హిమరాజు కుమార్తె పార్వతిగా పుట్టేవరకు, ఉండిపోయాడు. సతి హిమవంతుడికి పుత్రికగా పుట్టింది. ఆమెకు పార్వతి అనిపేరు పెట్టారు. ఆమె శివుని కొరకు కఠోరమైన తపస్సు చేసి శివుని భర్తగా పొందింది. ఆ శివ శక్తుల కలయికే శివుని అర్థ నారీశ్వరుని ఆవిర్భావం.

# మల త్రయం

-పరాశర ప్రసాద్

చక్కర పానకంలో నానబెట్టిన శనగగింజ మధురంగా వుంటుంది. అలాగే వేపరసంలో ఊరబెట్టిన గింజ చేదుగా వుంటుంది. అలాగే మనస్సును బహిర్ముఖంచేసి, ప్రాపంచిక వ్యవహారాలు, రాగద్వేషాలలో, కామక్రోధాది గుణాలలో, ఈర్ష్యా, అసూయలతో కాలం వెళ్ళబుచ్చే మానవుడి మనస్సుకి మాలిన్యం అంటకుండా ఉంటుందా! అదే మలము. సాధకుడి మనస్సులో దోషాలు మూడు విధాలుగా వుంటాయి. 1 ఆవరణ దోషము, 2. విక్షేప దోషము, 3. మలదోషము.

తన దేహము, లేక ఉపాధి తానుగా భావన చేసే దోషమే ఆవరణ దోషము. అలా కాకుండా మనస్సు విక్షేపం చెంది, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే పంచతన్మాత్రల ప్రభావం చేత కలిగే దోషాలు విక్షేపదోషాలు. సాధకుడు ఆచరించే కర్మ ద్వారాగాని, ప్రవర్తన ద్వారాగాని, సంక్రమించే ఫలమే మల దోషంగా భావించబడుతుంది. మల దోషం ప్రధానంగా మూడు విధములుగా వుంటుంది.

1. కార్మిక మలము, 2. మాయా మలము, 3. ఆణవ మలము. కార్మిక మలము స్థూల శరీరానికి చెందినది. మానవుడు తెలిసో తెలియకో ఇతర జీవరాసులకు హాని తలపెట్టవచ్చు. దోమలని చంపవచ్చు. లేదా తాను సంచరించినప్పుడు తన పాదాల క్రిందపడి ఏవైనా జీవులు మరణించవచ్చు. తాను తినే ఆహారం ద్వారాగానీ, త్రాగే నీటి ద్వారాగానీ, పీల్చే గాలి ద్వారాగాని ఎన్నో క్రిములకు హాని కలుగవచ్చు. ఈ క్రియల ద్వారా సంక్రమించిన పాప ఫలమే కార్మికమలము. కార్మికమల దోషం రహితం కావటం చాలా సులభము. సాధకుడు సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమైన మంత్రరాజాన్ని నిరంతర స్మరణ ద్వారా కార్మిక మలము రహితము అవుతుంది.

మాయా మలము సూక్ష్మ శరీరానికి సంబంధించినది. సాధకుడు తన వాక్కుద్వారా లేక ప్రవర్తన ద్వారా ఇతరుల మనస్సు నొప్పించినా, వారిని ఇతర విధములైన మానసిక, శారీరక బాధలకు గురిచేసినా కర్మని మూటకట్టుకోక తప్పదు కదా! ఆవిధంగా సంక్రమించిన కర్మఫలమే మాయామలము. అది చిత్తములో రికార్డు అవుతుంది. మానవుడు మనస్సుపెట్టి ఆచరించిన దుష్కృత కర్మలు చిత్తములో రికార్డు చేయబడి అవి స్వప్నంలో మనస్సు ద్వారా బహిర్గతమై మానసిక వ్యథకు గురికాక తప్పదు. మాయామలము సంచితార్థముగా

వెంటాడి సాధకుణ్ణి హింసిస్తుంది. స్వప్నానుభవం మెలుకువ వచ్చిన తరువాత ఎలా జ్ఞప్తికి వస్తుందో మాయామలం కూడా సంచితార్ధంగా జన్మను తీసుకువచ్చి ఫలాన్ని అనుభవింపజేస్తుంది. శ్రవణం చేసిన గురుబోధను మననం చేయటం ద్వారా అది నిదిధ్యాసకు వచ్చి మాయామలం రహితం అవుతుంది.

ఆణవమలం కారణ శరీరానికి సంబంధించినది. ఇది జన్మజన్మల నుంచి ఆర్జించిన వాసన. సాధకుని మనస్సులో జీర్ణించుకుపోయిన తీరని సంకల్పాలు బీజరూపంలో కారణశరీరంలో దాగి వుంటాయి. అదే వాసన. కారణ శరీరానికి ఆధారము వాసన. అది రహితం కానంతవరకు జన్మ తప్పదు. దేహం తాననే భావనే ఆణవమలానికి ఆధారము. అది తొలగటం దుర్లభం. అది తొలగాలంటే సద్గురుమూర్తి అనుగ్రహం కావాలి. సద్గురుమూర్తి ఉపదేశించిన 'తత్త్వమసి' అనే మహావాక్యాన్ని అనుభవించినప్పుడే ఆణవ మలం రహితమవుతుంది.

నిదురించేముందు మానవుడు ఏ భావనతో వుంటాడో మేల్కొన్న తరువాత అదే భావంతో ఉంటాడు కదా! అలాగే దేహాన్ని త్యాగం చేసిన మానవుడు ఏ సంకల్పంతో నిష్క్రమిస్తాడో ఆ సంకల్పాన్ని సాధించటానికి అనువైన పంజరంతో జన్మకి రావటం తప్పనిసరి. అందువలన ఆణవమలం రహితం కానిదే జన్మరాహిత్యం అసాధ్యం.

## సమర్ధ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మార్చి 2018, ఏప్రియల్ 2018, మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

మార్చి 2018 : AS 6560, 6589, 6634, 6660, 6672, 7240, 7246, 7247, 7249,
AS 7250, 7450, 7451, 6664

ఏప్రియల్ 2018 : AS 5229, 5568 నుండి 5572 వరకు, 5574, 5575,
AS 5591,6274, 6509,6682,6692,7108, 7251
నుండి 7254 వరకు, 7264, 7265, 7266, 7268.

– మేనేజర్

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

"అప్పడామె రాజుగారు నిర్వికల్ప సమాధి స్థితిలో వుండటం గమనించింది, ఆమె శిఖిధ్వజుని సమాధి స్థితి నుండి జాగృతం చేయాలనుకొన్నది. ఆమె సింహంలా గర్జించింది, ఆ సింహగర్జన, ఆ సమీపములో వున్న వన్యమృగములన్నింటినీ భయకంపితం చేసింది, కాని రాజుగారు మాత్రం చలించలేదు. అప్పడామె అతనిని జాగృతం చేయటానికి తన చేతులతో బాగా కుదిపి వేసింది, కాని ప్రయోజనం లేదు, తరువాత అతనిని నేల మీద విసిరికొట్టింది అయినా అతను లేవలేదు. అతని యింద్రియాలు మామూలు చేతన స్థితికి రాలేదు.



అప్పుడు ఆమె తనలో తాను యిలా అనుకొన్నది, 'ఇప్పుడు నా భర్త పరమాత్మలో లీనమయినాడని గ్రహించాను, ఇప్పుడు నేను నా దృష్టి ఆయన సూక్ష్మ దేహము పై కేంద్రీకరించి, నా అతీంద్రియ దృష్టి వలన, అతని హృదయంలో లేశమైనా సత్త్వములేక తెలివి లేక జీవము మిగిలివున్నదో గమనిస్తాను అలావుంటే అతనిని మరొక మార్గము ద్వారా మేల్కొల్పి, అతనితో ఆనందంగా జీవిస్తాను అలా కాకపోతే, నేను కూడ దేహాన్ని త్యజించి, విదేహముక్తిని పొందుతాను.

చూడాల తన మనసును శిఖిధ్వజుని సూక్ష్మదేహముపై కేంద్రీకరించి, తన దివ్య చక్షవుల ద్వారా అతని హృదయంలో కించిత్తు సత్త్వము లేక తెలివి లేక జీవము వున్నట్లు గ్రహించింది. అప్పుడు చూడాల తన యోగశక్తి వలన పరకాయ ప్రవేశము చేసింది, తను ధరించిన కుంభముని భౌతిక రూపాన్ని విసర్జించి, తన సూక్ష్మదేహాన్ని క్రోడీకరించి, శిఖిధ్వజుని మనసులో ప్రవేశించింది.

అక్కడ కొంచెంగా మిగిలి వున్న శుద్ధ సత్యమునకు చేతన కలిగేట్లు చేసింది. మనసులో ఆ భాగానికామె కదలికనిచ్చి, క్రియా పూరితమయ్యేట్లు చేసింది. తరువాత ఎలాగైతే వొక పక్షి చెట్టు కొమ్మపై కొద్ది సేపుండి, తిరిగి తన గూటికి చేరినట్లు, ఆమె తిరిగి కుంభముని శరీరంలో ప్రవేశించింది.

"ఆమె అప్పుడొక పూల పాన్పుపై కూర్చొండి, సామవేద గీతాలను, మధురమైన స్వరమతో వుచ్చరించింది, అప్పుడు రాజుగారా పాటలు వినగానే, అతని మేధస్సు, వొక అద్భుతమైన ఆనందానుభూతికిలోనై, అతని నిద్రాణమైన జీవితము, సూర్యకాంతిని

చూడగానే మొగ్గయైన పద్మము వికసించినట్లు, వికసించింది. నెమ్మదిగా అతను కనురెప్పలు తెరిచాడు, రాజుగారి దేహము మొత్తము నూతన జీవంతో వుత్తేజ పూరితమైనది.

తన ముందు కుంభమునిని చూచి, ఆయన నీవిధంగా స్తుతించాడు, "స్వామీ, మీ కృప వలన నేను నిర్వికల్ప సమాధిలోని, దివ్యానందముననుభవించాను. నేను జనన, మరణములనే కష్టవలయము నుండి విముక్తి పొందాను. సమాధిలో పొందిన దివ్యానందముతో పోలిస్తే, స్వర్గ సుఖములు కేవలము తుచ్ఛ మనిపించింది"

కుంభముని యిలా ప్రశ్నించాడు. 'ఓ రాజా! మీకిప్పుడన్ని బాధలు, సందేహాలు బ్రహ్మానందమును పూర్తిగా చవిచూశారా? మీరిప్పుడు విషయాసక్తమైన వస్తువుల పట్ల ఆకర్షణ, విముఖత లేకుండా వున్నారా? మీరు సమత్వ దృష్టి, సమరహిత దృష్టి పెంపొందించుకొన్నారా? మీరు యీ భువిలో వుండే విషయ సుఖాలపట్ల వుండే ఆసక్తిని పూర్తిగా నిర్మూలం చేసుకొన్నారా?"

శిఖధ్వజుడిలా సమాధానము చెప్పాడు 'ఓ పూజ్యగురుదేవా! మీకృప వలన నేను అన్ని రకాల బాధలు, సందేహాలు, ప్రేమ, ద్వేషము, భ్రమల నుండి విముక్తి పొందాను. నేను వినాశము, మరణము, వ్యాధుల నుండి స్వేచ్ఛ పొందాను. ఏది సాధించాలో, దానిని సాధించాను, నేను నాలో చాలా సంతృప్తిగా వున్నాను, నేనిప్పుడమోఘమయిన సంతృప్తి ననుభవిస్తున్నాను. నాకిక తెలుసుకోవలసినది, తెలియనిదంటూ యేమిలేదు. నేనిక పొందనిది, పొందవలసినదంటూ యేమిలేదు, నేనిక కోరుకోవలసినది, చూడవలసినది, వినవలసినదంటూ యేమిలేదు. నా ఆత్మ వికాసమునకు నేనిక యెవరి వద్ద నుండి, యెలాంటి సలహాలు తీసుకోవలసిన ఆవశ్యకతలేదు. నాకు సమత, సమహిత దృష్టి, దృక్పథము లభించింది".

తరువాత కుంభముని, శిఖధ్వజుడు యిద్దరు కలిసి ఆనందముగా అడవుల్లో, పర్వతాల పై విహరించారు, వారెన్నో సరస్సులను, నదులను చూశారు, ఒక రోజు కుంభముని రాజుగారితో యిలా అన్నాడు "ఈ రోజు దేవలోకానికి వొక గొప్ప పర్వదినము. ఆ సమావేశములో నేను, నారదుని ముందుకు వెళ్లాలి, నా నిష్క్రమణ విధిచే నిర్ణయింపబడ్డది, దానిని తప్పించటానికి యేవిధంగా కూడ సాధ్యముకాదు. న్యాయము నెదిరించటానికెవరికీ సాధ్యముకాదు, న్యాయమునకెవరూ యెదురీదలేరు, నేను తప్పకుండా, సూర్యాస్తమయ సమయానికి తిరిగి వస్తాను. అతను రాజుగారికి పుష్ప గుచ్ఛాన్ని యిచ్చి, తాను నిష్క్రమించాడు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**మార్చి 2018**

01 గురు - హోలీ, శ్రీ సద్గురు పాద పూజ.

11 ఆది - శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

15 గురు - మాస శివ రాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

17 శని - అమావాస్య.

18 ఆది - శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది; ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం; శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

18 ఆదివారం నుండి 24శనివారం వరకు మౌన ధ్యాన సప్తాహ శిబిరం.

25 ఆది- శ్రీరామనవమి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన.

31 శని - పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ.

**ఏప్రియల్ 2018**

10 మంగళ - శ్రీగురుదశమి. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

14 శని - మాసశివరాత్రి, శని త్రయోదశి. పావులూరులో ఏకాహం.

16 సోమ - అమావాస్య.

18 బుధ - అక్షయ తృతీయ, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

20 శుక్ర - శ్రీశంకరాచార్య జయంతి, శ్రీసద్గురు త్రివింశతి (23)వ ప్రతిష్ఠావార్షికోత్సవం - సత్సంగము, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

28 శని - శని త్రయోదశి.

29 ఆది - వైశాఖ పూర్ణిమ , బుద్ధ జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

**విశాఖపట్నంలో పూజ్యశ్రీ మాతాజీవారి**
**సత్సంగ సమావేశములు**

ది. 5-4-2018 నుండి 8-4-2018 వరకు
శ్రీకృష్ణ (గురువాయూరప్పన్) మందిరం,
సీతమ్మధార నార్త్ ఎక్స్టెన్షన్ నందు
**పూజ్య శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీ వారి**
సత్సంగ సమావేశములు.
అందరూ ఆహ్వానితులే!

వివరములకు - శ్రీ దాసరి ఆనంద్‌గారు - 98480 57814
శ్రీ దాసరి చిన బ్రహ్మయ్య గారు - 99490 88052

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

"పరమ శ్రేయో సౌధాన్ని చేరుకోవటం ఎలాగ? సద్గురుమూర్తి సమాశ్రయం సహజ ప్రక్రియేనా? అలా అయితే ఆ భాగ్యం అందరికీ కలగటం లేదే? కొందరికి మాత్రమే కలుగుతోందే? నేను తమరి దర్శనం కోసం శ్రీరామునితో యుద్ధానికి తలపడి, పరాభవం పొందిన తరువాతనే కలిగింది కదా! మీ ఆదేశం కోసం నిరీక్షిస్తున్నాను" అంటూ పరశు రాముడు దత్తాత్రేయుల వారిని దర్శించి, ప్రశ్నించాడు.



దానికి సమాధానముగా దత్తాత్రేయులవారు మాట్లాడుతూ "పరమ శ్రేయస్సు అనే సౌధం చేరాలంటే, సద్గురుమూర్తి అనుగ్రహం కలగాలి. అది పొందటానికి బీజము సత్సంగము లేదా సత్పురుషుల సమాశ్రయము. పరశురామా! నీవు సంవర్తకుని సమాశ్రయం ద్వారా దానిని పొంద గలిగావు. నీవు నిర్వహించిన క్రతువులు, కర్మలు, యజ్ఞ యాగాదులు కర్తవ్యనిర్వహణా ప్రక్రియగా చేశావు. కర్తవ్యనిర్వహణ కర్తృత్వ భావనతో చేస్తే మోహము జనిస్తుంది. యదార్థమే. అవి నిమిత్తమాత్రంగా నిష్కామ కర్మగా ఆచరిస్తే ఫలితం భిన్నంగా ఉంటుంది.

నీలో మోహము జనించి, శ్రీరామునితో యుద్ధానికి తలపడ్డావు. పరాభవం పొందావు. అయితే నీవు ఆచరించిన కర్తవ్యనిర్వహణ వృథా కాలేదు. శ్రీరామచంద్రునితో యుద్ధం చేసి, పరాభవం పొందాక నీలో పశ్చాత్తాపం కలిగింది. సంవర్తుని సందర్శనం పొందావు. నీలో శుభేచ్ఛ కలిగింది. నీవు కర్తవ్య విషవలయంలో చిక్కుకుని మృత్యువాత పడకుండా నీకు కలిగిన శుభేచ్ఛ నిన్ను సద్గురు మూర్తి చెంతకు చేర్చింది.

పరమ శ్రేయస్సు అనే సౌధం చేరాలంటే విచారణ కావాలి. విచారణ లేకపోతే మోహానికి దాసుడవ్వక తప్పదు. విచారణ చేయాలంటే బుద్ధి వికసించాలి. అది కేవలం సద్గురు అనుగ్రహం ద్వారానే సాధ్య పడుతుంది. వికసించిన బుద్ధి విచారణకు ప్రోత్సాహాన్నిస్తుంది.

నీ హృదయంలో సద్విచారణ అనే సూర్యోదయం అయిన మరు

క్షణంలోనే చీకటి లేదా అజ్ఞానం తొలగిపోతుంది. అవివేకి మోహానికి దాసుడై అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడి చివరికి వట్టిచేతులతో మట్టిపాలవుతాడు. సద్గురుమూర్తి అనుగ్రహం అందరిపైనా సమంగానే వర్షిస్తుంది. అయితే అది అందుకునే సాధకుల పాత్రని బట్టి వుంటుంది.

వర్షం కురిసింది అనుకో, సాగరంలో పడిన చినుకు నీటి పాలవుతుంది. భూమి మీద పడిన చినుకు సస్యాలకి ఉపయోగ పడుతుంది. కాని, ముత్యపు చిప్పలో పడిన చినుకు ముత్యమై ప్రకాశిస్తుంది కదా! ఈ విషయాన్ని సరిగా అవగాహన చేసుకుంటే కాల సర్పానికి బందీనయ్యాననే భావన ఉండదు. మృత్యుభయం అంతకన్నా వుండదు. నీలో కలిగిన పశ్చాత్తాపమే శుభేచ్ఛ జనింపజేసి, విచారణకు దోహదం చేసింది. విచారణ లేకపోతే మోహము తొలగదు. విచారణ లేకపోవటం చేతనే రాక్షసులు పతనమయ్యారు. అది లోపించటం చేతనే కదా బ్రహ్మదేవుడు కూడా శిరచ్ఛేదానికి గురయ్యాడు!

సద్గురుమూర్తి సమాశ్రయం సహజ ప్రకియ కాదు కానీ, సద్గురు సమాశ్రయం పొందిన వాడికి మృత్యుభయం తొలగటం మాత్రం సహజ ప్రక్రియ" అన్నారు శ్రీ దత్తగురువులు.



గుండుగొలను కాళీవనాశ్రమ శాఖ ద్వితీయ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా 10-2-2018 నాడు జరిగిన కార్యక్రమం.

శుభాభినందనలతో ...


# Grand
RADIATORS

**AN ISO 9001:2008 CERTIFIED COMPANY**

Manufactures of Radiators (Automobile and Industrial), Oil Coolers, Air Coolers, After Coolers, Inter Coolers, Finned Tube Coolers, Shell and Tube Heat Exchngers,Tube Bundles,Condernsers,Cooling Coils,All Pre-Heaters, Large After Coolers and Mechanically Bonded Radiators









# GRAND RADIATORS

PLOT NO 131, BLOCK – D, AUTONAGAR,
VISAKHAPATNM -530012.AP, INDIA
TELPHONE: 0891-2517706, 2564538, FAX NO. 0891-2513660, 2502640
E-mail: grandradiator@yahoo.in Website: www.grandradiators.com

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 11వ శ్లో॥**

**అయి మరళీ ముకున్ద స్మేర వక్త్రారవింద**
**శ్వసన మధుర సంజ్ఞే త్వాం ప్రణమామ్యద్య యాచే**
**అధరమణి సమీపం ప్రాప్త వత్యాం భవత్యాం**
**కథయర హసి కర్ణే మద్దశానన్ద సూనోః**

తాత్పర్యము -



వెన్నుని చిరునగవు తొలకు మోము దామర యందలి యూరుపు దేన సారస్యము నెరిగిన ఓ పిల్లన గ్రోవీ! నిన్ను మ్రొక్కి ఇప్పుడు ఒకదానిని వేడుచున్నాను. నీవు మోవి రతనము చేరువను పొందిన దానవగుచుండగా శ్రీకృష్ణుని యొక్క చెవిలో ఏకాంతమునందు నా పాటును చెప్పుము.

శ్రీ మహావిష్ణువు స్వరూపమే అయిన శ్రీకృష్ణుని చిరునవ్వు లొలికే ముఖ పద్మమునందు వ్రాలినపుడు వాని ఊర్పు తేనె సారస్వము నెరిగిన ఓ పిల్లన గ్రోవీ! నీకు మ్రొక్కి ఇప్పుడొక దానిని నిన్ను వేడుచున్నాను. అదేమనగా నీ సందర్శిత సంస్పర్శ భాగ్యాలను కోరుతూ ఆవేదన పడుతున్న నా మనస్సులోని బాధను నువ్వు వాని అధ రమణి సమీపంలో నిలిచినప్పుడు వాని చెవిలో ఏకాంతముగా వివరించి చెప్పవలసినది. నా ఆవేదనని వివరించి చెప్పగల అవకాశము నీకు ఉంది. నువ్వు నిరంతరం స్వామి అధరంలో నిలిచి ఉంటావు గనుక నీకంటె ఆప్తులెవరు నాకు కనబడలేదు.

## శ్రీ కాళీవనాశ్రమం నంబూరులో
## 13-2-2018 మహాశివరాత్రి మహోత్సవ దృశ్యమాలిక











# త్రిగుణాలు

- పాలూరి కాళీప్రసాద్

త్రిగుణాల గురించి శ్రీ గురుదేవులు శ్రీ బాబూజీ మహరాజ్ అనేక ఉపమానాలను చెప్పేవారు. అందులో కొన్ని ......

1. ఒక చీకటి గదిలో ఒక దీపం ఉంది. కానీ దాని మీద మూడు మూకుళ్ళు ఉన్నాయి. అందువల్ల ఆ దీపం వెలుగు ప్రసరించక ఆ గది అంతా చీకటిగా ఉంది. ముందుగా పైనున్న ఇనుప మూకుడును పగులగొడితే లోపలనున్న చిల్లుల మూకుడులో నుంచి కొద్దికొద్దిగా వెలుగు ప్రసరించి, గదిలో వున్న వస్తువులు తెలుస్తాయి. ఆ చిల్లుల మూకుడును కూడా పగులగొడితే లోపలనున్న గాజు మూకుడు ద్వారా దీపం యొక్క కాంతి స్పష్టంగా గోచరిస్తుంది. కానీ ఈ గాజు మూకుడు కూడా కొంతకాలానికి మసిబారే అవకాశం వున్నది. కనుక ఆ మూకుడు కూడా తొలగించుకుంటే శాశ్వతంగా దీప కాంతిని అనుభవించవచ్చు. ఇందులో ఇనుప మూకుడు తమోగుణం. చిల్లుల మూకుడు రజోగుణం. గాజు మూకుడు సత్వ గుణం. ఈ మూడు గుణాలు మనలోనే వున్న జ్ఞానజ్యోతిని దర్శించడానికి పైన చెప్పిన ఉదాహరణలో వలె మనకు అడ్డు పడుతున్నాయి.

2. తెల్లని కాంతి మూడు పలకల గాజు పట్టకంలో నుంచి ప్రసరింపజేస్తే ఆ తెల్లని కాంతి విక్షేపం చెంది ఏడు రంగులలో మనకు కనిపిస్తుంది. అలాగే ఒక్కడే అయిన పరమాత్మ మూడు గుణాలతో కూడిన మన మనస్సులకు ఇన్ని విభిన్న రూపాలలో, లక్షణాలతో ప్రకృతిగా కనిపిస్తున్నాడు. ఈ ముడు గుణాలను తొలగించుకుంటే సర్వత్రా ఒక్క పరమాత్మనే దర్శించగలుగుతాము.

3. మూడు రెక్కలుగల ఫ్యాన్ ఆగినప్పుడు రెక్కలు మూడు విడివిడిగా కనిపిస్తాయి. అదే ఫ్యాన్ వేగవంతంగా తిరుగుతున్నప్పుడు మూడు రెక్కలు మాయమై ఒక్కటే ఆకారం కనిపిస్తుంది. అలాగే భగవన్నామాన్ని వేగంగా (అంటే మధ్యలో విషయాదులేవీ అడ్డురాకుండా) జపించినప్పుడు ఈ మూడు గుణాలు మాయమై ఏకవస్తు దర్శనం అవుతుంది.

4. ఆధ్యాత్మిక సాధనలో మనం ముందుగా రజోగుణాన్ని (అంటే దానిలో భాగమైన పట్టుదల, ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం మొదలైనవి) వుపయోగించుకుని తమోగుణాన్ని (అంటే బద్ధకాన్ని, సోమరితనాన్ని) జయించాలి. ఆ తరువాత సత్వగుణాన్ని వుపయోగించుకుని, రజోగుణాన్ని కూడా జయించాలి. ఇక చివరిగా సత్వగుణాన్ని కూడా జయిస్తేనే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది.

5. రజో, తమో గుణాలు ఇనుప, ఉక్కు సంకెళ్ళయితే, సత్వ గుణం బంగారు సంకెళ్ళ లాంటిది. ఏ సంకెళ్ళయినా మనసును బంధించేవే!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

మార్చి 2018

01 గురువారం - ఫాల్గుణ పౌర్ణమి; హోలీ సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

11 ఆదివారం- శ్రీగురుదశమి, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ. భక్త సమారాధన.

18 ఆదివారం - శ్రీ విలంబి నామ సంవత్సర ఉగాది, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

25 ఆది శ్రీరామనవమి. ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

31 శనివారం - పూర్ణిమ. సా॥ 5-30గం. శ్రీసద్గురుపాదపూజ.

ఏప్రియల్ 2018

10 మంగళ- శ్రీగురుదశమి సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

29 ఆది - వైశాఖ పూర్ణిమ, బుద్ధజయంతి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం.

శుభాభినందనలతో ...


VennTech
Manufacturer of
Ventilation System /
Air Handling Equipments
for Marine applications
PRODUCTS :
Blowers
ATU'S
Coolers
Moisture Separaters
Heat Exchangers
PLOT NO: 1-125/17/A, MIE, HAFEEZPET, MIYAPUR, HYDERABAD – 500 049.
MOBILE: 9000410044, TEL : 040 – 64100589, FAX:040-23116650
E-MAIL: VENNTEC@GMAIL.COM

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

ఇదంతా కలా? నిజమా? బిత్తరపోయిన మహంకాళికి దు:ఖం పొర్లుకుని వచ్చింది. భోరున ఏడుస్తూ తాతయ్యగారి కాళ్ళ మీద పడి, "క్షమించండయ్యా! నేనేం తప్పు చేశానో తెలియటం లేదు" అన్నాడు. "నువ్వేమీ తప్పు చేయలేదురా! నిన్నూ నన్నూ పుట్టించిన తండ్రి భగవంతుడొక్కడే అనే మాట మరచిపోయి, నిన్ను వెలి వేసినట్లు చూసి, యిన్నాళ్ళూ నేనే తప్పు చేశాను. కూర్చో. భోజనం చెయ్యి. ఇది శ్రీబాబు ప్రసాదం" అన్నారు. మహంకాళి ఎంతో భయ భక్తులతో భోజనం చేసి, తన విస్తరి తీసి వేసుకోబోయాడు "వద్దు అక్కడే ఉంచు. ఇంట్లో వాళ్ళుతీసి వేస్తారు. భక్తుల భోజనం చేసిన విస్తరి తీసి, శుభ్రం చేస్తే ఎంతో పుణ్యం" అని తాతయ్యగారు అన్నారు. అంతలో శ్రీబాబు అక్కడికి వచ్చారు. తాతయ్యగారు శ్రీబాబుకు సాష్టాంగ వందనం చేసుకున్నారు. మహంకాళి దూరంగా జరిగి నేలపై సాష్టాంగ నమస్కారం చేశాడు. "నువ్వు కూడా పాదాలను తాకి నమస్కారం చేసుకోవచ్చు" అన్నారు శ్రీబాబు. మహంకాళి మొహం చాటంతైంది. గబ గబా వచ్చి లెంపలు వేసుకుని శ్రీబాబు పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసుకుని లేచి, ఆనంద బాష్పాలతో చేతులు కట్టుకుని నిలబడ్డాడు. శ్రీ బాబు అతనితో కొద్దిసేపు మాట్లాడి, ఆశీర్వదించి పంపిన తరువాత తాతయ్యగారిని దగ్గరకు తీసికొని "ఇవాళ నువ్వు నిజమైన ఆచరణ యోగివి అయినావు తాతయ్యా! నాకు చాలా సంతోషంగా వుంది" అన్నారు.



తాతయ్యగారికి శ్రీబాబు యెడల ఏర్పడిన అనన్య లక్ష్యానికి వుదాహరణగా జరిగిన మరొక సంఘటన చూద్దాం. తాతయ్యగారింట్లో వారి కుమార్తె వివాహం జరిగింది. ఇల్లంతా పెళ్ళి వారితోనూ, శ్రీబాబు

భక్త బృందంతోనూ సందడిగా ఉంది. వివాహం అయిన పిదప వియ్యాలవారికి, శ్రీబాబు భక్తులందరికి, సహపంక్తి భోజనాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వియ్యాలవారికి శ్రీబాబును గూర్చి ఏమీ తెలియదు. భక్త బృందంలో అన్ని కులాల వారూ ఉన్నారని తెలిసి, వియ్యాలవారు తమకు వేరుగా వడ్డన ఏర్పాటు చేయమని, సహ పంక్తిలో వద్దని తాతయ్యగారికి కబురు చేశారు.

తాతయ్యగారు వారితో శ్రీబాబు మహత్త్వాన్ని, లోకోత్తర వ్యక్తిత్వాన్ని గూర్చి చెప్పి, శ్రీబాబు సన్నిధానం పరమ పవిత్రమని, వారి భక్త బృందంతో సహపంక్తి భోజనము అపూర్వమైన మహద్భాగ్యమని ఎంతో వివరించారు. కాని తమకు వేరుగా వడ్డన చేయవలసిందే అని వియ్యాలవారు అలిగి కూర్చున్నారు. సామాన్యంగా వివాహ సందర్భాలలో యిటువంటి అలకలు ఘర్షణలు జరగటము, అవి ఒక్కొక్కసారి చినికి చినికి గాలి వానగా మారి విపరీత పరిణామాలకు దారితీయటము కద్దు. అందులో అవతలి వారు మగపెళ్ళి వారు. తాతయ్యగారి మిత్రులు కొందరు “పోనీ వారికి వేరే వడ్డన చేయించ రాదా” అని సలహా కూడా యిచ్చారు. అయినా తాతయ్యగారు ఏమాత్రమూ చలించలేదు. వారు వియ్యాలవారితో “అయ్యా! శ్రీబాబు నాకు గురుదేవులు. వారి భక్త బృందము నాకు అవశ్యము పూజనీయము. వారిని నేను యీ వివాహానికి ఆహ్వానించాను. నా గృహంలో నా అతిథులతో బాటు వారికి సమస్థానం యివ్వటం నా ధర్మం. అలాటిది వారిని కులము పేరిట విచక్షణ చేసి, వేరుగా వడ్డన చేయటం అసంభవము” అని నిష్కర్షగా చెప్పారు. కొంత తర్జన భర్జన తరువాత వియ్యాలవారు సహ పంక్తి భోజనానికంగీకరించారు. గురు దీక్షకే విజయం లభించింది. సత్యమేవ జయతే.

తన పూర్వ జీవితము ఎట్టిదైనా, మానవుడు తానొక గురుదేవుని ఆశ్రయించిన తరువాత, ఎంతటి మార్పుకైన సిద్ధపడి గురుదేవుని సేవకొరకు , అనుగ్రహము కొరకు తపించాలి. నిర్విరామ కృషి చేయాలి. అలా మారిన కొలది, అతను గురుదేవునికి మరింత సన్నిహితుడౌతాడు. రాను రాను ఆత్మీయులైపోయారు.

-సశేషం

(గత సంచిక తరువాయి) **విష్ణు**  **కథలు** - రమణ ప్రసాద్

## శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు

"ఓ జగదీశ్వరా! నేను నీలో లయమయ్యేలా ఆశీర్వదించమ"ని ప్రార్థించాడు శివరాముని ప్రార్ధన సదాశివుని కదిలించింది. భగవదనుగ్రహంతో అతనికి గురుసాన్నిధ్యం లభించింది. కామకోటిపీఠ శంకరాచార్యులైన పరమ శివేంద్ర సరస్వతీ స్వాముల వారి చరణాలను ఆశ్రయించారు. పరమశివేంద్ర స్వాముల వారు శివరామునిలో భాసించే చైతన్య దీపికను దర్శించి "సదాశివా!" అని సంబోధించారు. సదాశివ బ్రహ్మేంద్రులు కఠిన సాధనను ఆచరించారు. శ్రావ్యమైన కీర్తనలు రచించారు. తర్క శాస్త్ర పండితుడై ఎందరో పండితులను ఓడించారు. ఒకనాడు సదాశివునిచే పరాజితుడైన పండితుడు పరమశివేంద్ర గురువుల చెంతచేరి, సదాశివుడు వాచా వేదాంతిగా తయారవుతున్నాడని ఫిర్యాదు చేశాడు. పరమశివేంద్రులు, సదాశివుని పిలిచి, "సదాశివా!" నీవు మౌనాన్ని పాటించేది ఎప్పుడు?" అని ప్రశ్నించారు. గురుదేవా! మీ ఆజ్ఞ కొరకే కాచి ఉన్నాను ఇప్పటి నుంచే మౌన వ్రతాన్ని పాటిస్తున్నాను." అని గురుపాదాలకు ప్రణమిల్లాడు. ఆనాటి నుంచి తన శరీరాన్ని చాలించే వరకు మాట్లాడలేదు. అందరిని ప్రేమిస్తూ, మంచిని పంచుతూ, మనుగడ సాగిస్తున్న సదాశివ బ్రహ్మేంద్రుల వారు శరీరాన్ని త్యాగం చేసే సమయం ఆసన్నమైనది. సదాశివ బ్రహ్మేంద్రులవారు భక్తుల నందరిని పిలిచి తమ అంతిమ సందేశాన్ని వ్రాశారు-"పాంచభౌతిక ఈ శరీరాన్ని నేను త్యజించనున్నాను. ఇక్కడ ఒక గుంట త్రవ్వి అందులో నా శరీరాన్ని సమాధి చేయండి. సమాధి పైన బిల్వ మొక్కను నాటండి. కాశీ నుండి ఒక బ్రాహ్మణుడు శివలింగాన్ని తెస్తాడు. ఆ శివలింగం శ్వేతవర్ణంలో ఉంటుంది. శివలింగాన్ని సమాధి పై ప్రతిష్ఠ చేసి నిత్యపూజ జరిగేలా చూడండి. .సదాశివ బ్రహ్మేంద్రులవారు దివ్య పారవశ్యంలో ఉన్నారు. భక్తులు దుఃఖాన్ని ఆపుకోలేక పోతున్నారు. ఒక భక్తుడు ఆవేశంతో "భగవాన్! మిమ్మల్నివదిలి మేము జీవించలేము. భగవంతుని చేరటానికి మేము ఏమి చేయాలి? తెలియచేయండి." అని భోరున ఏడ్చాడు. అంతర్ముఖుడు అవుతున్న సదాశివ బ్రహ్మేంద్రులు తీవ్ర ప్రయత్నంలో కళ్ళు తెరిచారు. దుఃఖిస్తున్న భక్తుని చూశారు. బ్రహ్మము చేరే మార్గం తెలుపమంటున్నాడు. బ్రహ్మము లేనిది ఎక్కడ? అంతా నిండి ఉన్న బ్రహ్మాన్ని చేరేదేమిటి? అందరూ బ్రహ్మంలోనే వున్నారు. "నిరంతరం నేను బ్రహ్మను" అనే భావంతో ఉండి పోవటమే ముక్తి. అదే మోక్షము" అని తెలియ చేశారు. సదాశివబ్రహ్మేంద్రుల వారి భౌతిక కాయాన్ని సమాధి చేసి, దానిపై బిల్వమొక్కను నాటారు. సమాధి ముందు శివలింగాన్ని ప్రతిష్ఠ చేశారు. నిత్యపూజలు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

# సమర్థ సద్గురు

[యాజమాన్యం తదితర వివరాలు]

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాళీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ చారిటబుల్ ట్రస్ట్<br>D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియచేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి. వి. రమణబాబు

ది. 1-3-2018

పబ్లిషర్

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL